నవతెలంగాణ
ఆదిలాబాద్
మంగళవారం | డిసెంబర్ 24, 2024 | www.navatelangana.com



## మాదారంలో మంచి నీటి కటకట

నవతెలంగాణ-తాండూర్



మండలంలోని మాదారం టౌన్‌షిప్‌లో మంచినీటి కటకట నెలకొంది. మాదారం టౌన్‌షిప్‌కు నీటిని సరఫరా చేసే ఎంవీకే1 బోరింగ్ మోటర్ చెడిపోవడంతో సమస్య తలెత్తింది. దీంతో నాలుగు రోజులుగా మాదారంలో నల్లాలు రావడం లేదు. దాంతో టౌన్ షిప్ వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామపంచాయతీ వాళ్ల ట్యాంకర్ల ద్వారా ఇంటికి పది బిందెలు చొప్పున మంచినీటిని సరఫరా చేస్తున్న గృహ అవసరాలకు సరిపోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సింగరేణి యాజమాన్యం స్పందించి మోటార్ బాగు చేయడం లేదా కొత్త మోటర్ బిగించి నీటి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

## రూరల్ పోలీస్‌స్టేషన్ తనిఖీ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్



ఆదిలాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్‌ను ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్‌రెడ్డి సోమవారం తనిఖీ చేశారు. ముందుగా ఆయనకు సీఐ, ఎస్సైలు స్వాగతం పలికారు. అనంతరం పోలీస్‌స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటి నీరుపోసి, వాటిని సంరక్షించాలని అన్నారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. స్టేషన్‌లో ఎప్పటికప్పుడు కేసులను పరిష్కరించాలని సూచించారు. పెండింగ్‌లో పెట్టకుండా పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ పణిధర్, ఎస్సై ముజాహిద్, సిబ్బంది పాల్గొన్నారు.

# రైతులపై లాఠీచార్జిని ఖండిస్తున్నాం

● కలెక్టరేట్ ఎదుట రైతు సంఘం ఆధ్వర్యంలో నిరసన



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కేంద్రంలోని బీజేపీ తీసుకువచ్చిన నల్ల చట్టాలకు వ్యతిరేకంగా 13 నెలల పాటు పంజాబ్ రైతులు ఆందోళన చేయడంతో వెనక్కి తగ్గారని, కానీ వాటిని అమలు చేసేలా యత్నిస్తుండటంతో మళ్లీ ఆందోళనలు ప్రారంభమయ్యాయని రైతు సంఘం నాయకులు బండి దత్తాత్రి తెలిపారు. ఆందోళన చేస్తున్న రైతులపై ప్రభుత్వం లాఠీ చార్జీ, బాష్పవాయువు ప్రయోగించడాన్ని నిరసిస్తూ కిసాన్ మోర్చ పిలుపు మేరకు దేశవ్యాప్త ఆందోళనలో భాగంగా సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బండి దత్తాత్రి మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతులకు వ్యతిరేకంగా చట్టాలను తీసుకువచ్చిందన్నారు. 13 నెలలతో పాటు పంజాబ్ రైతులు నిరసన తెలుపడంతో వెనక్కి తగ్గి చట్టాలను ఉపసంహరించుకోవడంతో పాటు గిట్టు బాటు ధర కల్పించేలా చట్టం తీసుకువస్తామని చెప్పి విస్మరించిందన్నారు. మళ్లీ వాటిపై రైతులు ఆందోళనలు చేస్తుంటే పోలీసులతో లాఠీచార్జీ, టీయర్ గ్యాస్ ప్రయోగించడం సరి కాదన్నారు. రైతుల సమస్యలను పరిష్కరించాలని, లేని పక్షంలో వారికి అండగా దేశ వ్యాప్తంగా ఆందోళనలు కొనసాగుతాయన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు నారాయణ, కిరణ్, ఆశన్న, సచిన్ ఉన్నారు.

**రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి...**

అఖిల భారత విప్లవ రైతు సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం అధ్యక్షుడు జక్కుల నర్సింహ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలన్నారు. రైతులందరికి ఆకాంక్షలు లేకుండా రుణమాఫీ చేయాలని, పంటలకు మద్దతు ధర కల్పించాలని, అటవీ హక్కు చట్టం 2006 అమలు చేయాలని కోరారు. అదే విధంగా అటవీ, విద్యుత్ ప్రయివేటీకరణ చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు గోగర్ల శంకర్, సుధాకర్ పాల్గొన్నారు.

**వ్యవసాయ కళాశాల ఆధ్వర్యంలో...**

జాతీయ రైతు దినోత్సవాన్ని సోమవారం వ్యవసాయ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ శ్రీధర్ చౌహాన్ మాట్లాడుతూ భారత మాజీ ప్రధాని చౌదరి చరణ్‌సింగ్ వ్యవసాయ రంగానికి చేసిన కృషి కారణంగా ఆయన జన్మదినాన్ని పురస్కరించుకొని రైతు దినోత్సవాన్ని నిర్వహించుకోవడం జరుగుతుందని అన్నారు. వ్యవసాయ రంగంపైన దేశ అత్యధిక జనాభా ఆధారపడి జీవనం సాగిస్తున్నారని అన్నారు. వ్యవసాయ కళాశాల చదువుతున్న, విద్యార్థుల రైతుల పట్ల పూర్తి అవగాహనను కలిగి ఉండటమే కాకుండా రైతులకు ఉపయోగపడే వినూత్న కార్యక్రమాలను నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

**అఖిలపక్షం రైతు సంఘం ఆధ్వర్యంలో..**

రైతులు పండించిన పంటలకు మద్దతు ధర కల్పించడంతో పాటు చట్టబద్ధత కల్పించాలని అఖిల పక్షం రైతు సంఘం నాయకులు బండి దత్తాత్రి అన్నారు. సోమవారం రైతు దినోత్సవాన్ని పురస్కరించుకొని కిసాన్ చౌక్‌లో కిసాన్ విగ్రహానికి పూలామలలు వేసి వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా అఖిల పక్షం రైతు సంఘం నాయకులు బండి దత్తాత్రి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. రైతులకు సౌకర్యాలతో పాటు ఫసల్ బీమా, రైతు భరోసా, పంటల బీమా పథకాలను అమలు చేయాలని కోరారు. స్వామి నాథన్ కమిషన్ సిఫార్సు ఆధారంగా పంటలకు మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. రైతుల సంక్షేమమం దిశా ప్రభుత్వాలు ముందుకు సాగాలని కోరారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తు ప్రతిఘటనలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు గోవర్ధన్, పొశెట్టి, రోకండ్ల రమేష్, నారాయణ, లంక రాఘవులు, సచిన్, కిరణ్ పాల్గొన్నారు.

**తలమడుగు :** మండలంలోని భరంపూర్ గ్రామంలో మాజీ ప్రధాని చరణ్ సింగ్ జన్మదినం సందర్భంగా జాతీయ రైతు దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా 5 గురు ఉత్తమ రైతులను గుర్తించి, రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షులు సంగెపు బోర్రన్న గ్రామస్తుల ఆధ్వర్యంలో రైతులను శాలువాలతో సత్కారించారు. రైతంగానికి చేసిన కృషి ఫలితంగానే హరిత విప్లవం విచ్చిందన్నారు. దేశానికీ వెన్నుముక రైతని అన్నారు. ఆర్థిక సంక్షోభం మూలంగా తాను తీసుకున్నటువంటి నకిలీ విత్తనాలు, పంట దిగుబడులు రాకపోవడంతో రైతులు ఎందరో ఆత్మహత్యలు చేసుకున్న సందర్భం కనిపిస్తుందన్నారు. రైతులకు మద్దతు ధరతో పాటు సబ్సిడీ విత్తనాలు, స్థానికంగా ఉన్న వ్యవసాయశాఖ అధికారులు అవగాహన కల్పించి, రైతులకు భరోసాను ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రతాప్, నారాయణరెడ్డి, కిసాన్ మిత్ర ఫీల్డ్ కోఆర్డినేటర్స్ రమాకాంత్, రాకేష్, స్థానిక వ్యవసాయశాఖ ఏఈఓ మనీషా పాల్గొన్నారు.

## అమిత్‌షాను మంత్రివర్గం నుంచి భర్తరఫ్ చేయాలి

● కాంగ్రెస్ పట్టణాధ్యక్షులు నాందేడపు చిన్ను



నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

కేంద్రమంత్రి అమిత్‌షాను వెంటనే కేంద్ర మంత్రి వర్గం నుంచి బర్తరఫ్ చేయాలని కోరుతూ కాంగ్రెస్ నాయకులు సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ అభిలాష అభినవ్‌కు వినతిపత్రం అందజేశారు. ఏఐసీసీ, పీసీసీ సూచనల మేరకు నిర్మల్ డీసీసీ అధ్యక్షులు శ్రీహరి రావు ఆధ్వర్యంలో సోమవారం మొదట జిల్లా కేంద్రంలోని ట్యాంకుబండ్ వద్ద గల అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేశారు. అనంతరం ర్యాలీగా బయలుదేరి కలెక్టరేట్‌కు చేరుకొని, నిరసన తెలిపారు. పార్లమెంటు సాక్షిగా కేంద్ర హోమ్‌శాఖ మంత్రి అమిత్‌షా బాబాసాహెబ్ అంబేద్కర్‌పై చేసిన వ్యాఖ్యలకు నిరసనగా ఈ కార్యక్రమం చేపట్టిందన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జీవితాన్ని బడుగు బలహీన వర్గాలకు అంకితం చేసిన మహనీయుడు అంబేద్కర్ అన్నారు.

## రాజరాజేశ్వర ఆలయంలో చోరికి యత్నం



నవతెలంగాణ-కుభీర్

మండలంలో గత కొన్ని రోజుల నుంచి వరుస దొంగతనాలు జరుగుతున్నాయి. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పార్డి(బి) గ్రామంలో ప్రసిద్ధి గాంచిన శ్రీ రాజరాజేశ్వర ఆలయంలో ఆదివారం అర్ధ రాత్రి రెండు గంటల సమయంలో ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు కారులో నుంచి దిగి ఆలయంలోకి చొరబడటంతో ఆలయ హుండీని పగలగొట్టడానికి యత్నించారు. హుండీ బాక్స్ పగలకపోవడంతో వారు హుండీ బాక్స్ నే తీసుకెళ్లేందుకు ప్రయత్నించారు. దీంతో వారు ఆలయానికి సమీపంలో ఉన్న ఒక వ్యక్తి ఆలయంలో నుంచి చప్పుడు రావడం గమనించి, గ్రామంలో ఉన్న కొందరికి ఫోన్‌చేసి సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి 100కు కాల్ చేశారు. దీంతో పోలీసులు, భైంసా పోలీసులు కలిసి దొంగలించిన వ్యక్తులకు భైంసా వైపుకు వెళ్లడంతో మహాగాం గ్రామ సమీపంలో దొంగలించిన వ్యక్తి కారు చెట్టుకు డికోట్టాడంతో వారు పోలీసులకు దొరికిపోయారు. దీంతో వారిని పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఇలాంటి దొంగతనాలు మరి కొన్ని చోట్ల చేసినట్లు అనుమానంతో వారిని విచారించారు. మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

## ఆరు గ్యారంటీల అమలుకు ప్రభుత్వం కృషి

● బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్



నవతెలంగాణ-తాండూర్

ప్రజలకు ఇచ్చిన హామీ ప్రకారం 6 గ్యారంటీల అమలు చేసేందుకు ప్రభుత్వం శాయశక్తుల కృషి చేస్తోందని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ తెలిపారు. సోమవారం బెల్లంపల్లి క్యాంప్ ఆఫీస్ ఆవరణలో కల్యాణలక్ష్మి షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం ఇప్పటికే ఉచిత బస్సు, సబ్సిడీ గ్యాస్, ఉచిత విద్యుత్ అమలు చేశామని గుర్తు చేశారు. అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేశామన్నారు. ఇచ్చిన హామీ ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా భూమి లేని నిరుపేదలకు బృతి చెల్లించే విధంగా చర్యలు తీసుకుంటుందన్నారు. ఇండ్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసేందుకు ప్రభుత్వం గ్రామాల్లో సర్వే కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ప్రజలు సర్వేకు సహకరించాలని కోరారు. అనంతరం బెల్లంపల్లి మున్సిపాలిటీలోని నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో పాల్గొని కేకు కట్ చేసి నియోజకవర్గ ప్రజలకు ముందస్తుగా క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, ఆర్డిఓ హరికృష్ణ, బెల్లంపల్లి తహసీల్దార్ జోష్ణ, ఏసీపీ రవికుమార్, తాండూర్ తహసీల్దార్ ఇమ్రాన్ ఖాన్, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు సూరం రవీందర్, బెల్లంపల్లి పట్టణ అధ్యక్షుడు మూచర్ల మల్లయ్య పాల్గొన్నారు.

## విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలి



నవతెలంగాణ-తాండూర్

విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తహసీల్దార్ ఇమ్రాన్ ఖాన్ సూచించారు. ఎంపీడీఓ శ్రీనివాస్ ఎంఈఓ మల్లేశంతో కలిసి స్థానిక కస్తూర్బా గురుకులాన్ని సందర్శించి బోధన సిబ్బందికి పలు సూచనలు చేశారు. గురుకులంలోని విద్యార్థుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని చిన్నచిన్న ఆరోగ్య సమస్యలు తలెత్తినా వైద్యులను సంప్రదించాలన్నారు. అంటు వ్యాధులు ప్రబలకుండా విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించేవిదంగా ప్రోత్సహించాలని తెలిపారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. సోలార్ ప్లేట్లు ధ్వంసం కావడంతో వేడి నీటి సరఫరాలో సమస్యలు తలెత్తుతున్నాయని ఎస్ఓ కవిత తెలిపారు. వేడినీటి సమస్య పరిష్కారం కోసం విద్యాశాఖకు లేఖ రాయనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాస్ తెలిపారు. గురుకులంలో మధ్యాహ్న భోజనం చేసిన అధికారులు బాగుందని కితాబిచ్చారు. పెరిగినది చార్జీలకు అనుగుణంగా మెనూ ప్రకారం భోజనాలను అందించాలని సూచించారు.

## సోషల్ మీడియా పట్ల బాధ్యతగా వ్యవహరించాలి



నవతెలంగాణ-జైపూర్

సోషల్ మీడియాలో వచ్చే పోస్టులు, ప్రచారం చేస్తున్న సంధర్భంలో మనమంతా బాధ్యతగా వ్యవహరించాలని భీమారం ఎస్ఐ స్వేత అన్నారు. కమ్యూనిటీ కాంట్రాక్టు కార్యక్రమంలో భాగంగా సోమవారం పోతన్‌పల్లి గ్రామస్థులతో సమావేశమైన ఆమె సోషల్ మీడియా విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. సైబర్ నేరాల పట్ల జాగ్రత్తగా వ్యవహరించాలని, అవసరమైన సంధర్భంలో పోలీసులకు సమాచారం ఇవ్వాలని అన్నారు. సోషల్ మీడియాలో వచ్చే అబద్దపు ప్రచారాన్ని నమ్మి మోసపోవద్దని తెలిపారు. అదేవిధంగా ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించాలని తెలుపుతూ వాహణాలు నడుపుతున్న వారు తమ వాహణాలకు సంబంధించిన ధృవపత్రాలతో పాటు వ్యక్తిగత లైసెన్స్ తమతో పాటు కలిగివుండాలని అన్నారు. చిన్న పిల్లలకు వాహణాలు ఇవ్వకుండా జాగ్రత్త పాటించడమే కాకుండా రోడ్డుపై ప్రయాణిస్తున్న సమయంలో ఇతరులకు ఇబ్బంది లేకుండా జాగ్రత్తగా వాహణాన్ని నడిపించాలని తెలిపారు. మధ్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడితే చట్టపరంగా కేసులు నమోదు చేయడం జరుగుతుందని అన్నారు.

## విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

నవతెలంగాణ-బజార్‌హత్నూర్

విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ క్రీడల్లో రాణించాలని సరస్వతి శిశు మందిర్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వర్ని వెంకట రమణ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని శ్రీ సరస్వతి శిశు మందిర్ ప్రాథమిక పాఠశాల ఆధ్వర్యంలో జాతర్ల స్టేడియంలో సంకుల స్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో స్థానిక పాఠశాలతో పాటు బోథ్, నేరడిగొండ, గుడిహత్నూర్, ఇచ్చోడ, నార్నూర్ పాఠశాలల బాల బాలికలు కబడ్డీ ఖోఖో 100, 200, 400 మీటరు పరుగు, హైజంప్, లాంగ్‌జంప్, షాట్‌పుట్, తదితర క్రీడల్లోవిద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జాతర్ల సర్పంచ్ ఆత్రం నాగోరావు, మాజీ జెడ్పీటీసీ బలరాం, పాఠశాల ఉపాధ్యక్షులు కొత్త శంకర్, కార్యదర్శి రాజన్న, జాతర్ల క్రీడ పాఠశాల ఉపాధ్యాయుడు సంతోష్, ఆచార్య బృందం విద్యార్థులు పాల్గొన్నారు.

# కాంట్రాక్టు ఉద్యోగులు ప్రతిపక్షాల మాయలో పడొద్దు



నవతెలంగాణ-బోథ్

కాంట్రాక్టు ఉద్యోగులు ప్రతిపక్షాల మాయలో పడవద్దని కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీకి కట్టుబడి ఉన్నామని, విద్యార్థుల విద్యాసంస్థల భవిష్యత్తుకై అందరం కలిసి ముందుకు వెళ_న్నామన్నారు. రాష్ట్రంలో ముఖ్యంగా విద్యారంగంలో ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తున్న సీఆర్టీలు, సమగ్ర శిక్ష అభియాన్ పథకంలో పనిచేస్తున్న ఉద్యోగులు, కేజీబీవీలలో పనిచేస్తున్న ఉద్యోగులకు ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీకి కట్టుబడి ఉందని అన్నారు. అయితే ప్రస్తుతం రాష్ట్రంలో విద్యార్థులు చదువు మధ్యలో ఉన్నదని ఆర్థిక పరిస్థితి కూడా అంతంత మాత్రమే ఉందని ఈ సమయంలో చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవడం ఉత్తమమని అన్నారు. 10 సంవత్సరాల బీఆర్ఎస్ పరిపాలనలో విద్యావ్యవస్థ నీరుగారి పోయిందన్నారు. ఉపాధ్యాయుల ప్రమోషన్లు బదిలీలు లేకుండానే ఇప్పుడు సమ్మె చేస్తున్న వారిపై భారం మోపి విద్యావ్యవస్థను నిర్వీర్యపరిచారన్నారు. సమస్య పరిష్కారానికి కృషి చేద్దామని ఉద్యోగ సంఘాలు పట్టు వీడి రాష్ట్ర ప్రభుత్వానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ బొడ్డు గంగారెడ్డి పాల్గొన్నారు.

# ఫిర్యాదుల విభాగానికి అధికారులు డుమ్మా



నవతెలంగాణ-కుభీర్

ప్రతి సోమవారం నిర్వహించే ప్రజాఫిర్యాదుల విభాగానికి అన్ని శాఖలకు చెందిన అధికారులు హాజరుకావాల్సి ఉండగా సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో కేవలం ముగ్గురే ముగ్గురు అధికారులు హాజరు కావడంతో మండలంలో చర్చనీయాంశం అయ్యింది. ఆయా గ్రామాల ప్రజలు వారి సమస్యలను పరిష్కరించుకునేలా ఉంటుందనే ఉద్యేశంతో ప్రజా విభాగం ఏర్పాటు చేశారు. కానీ ఇప్పటి వరకు పంచాయతీ రాజ్, వ్యవసాయా శాఖ, మండల విద్యాధికారి, నీటి పారుదల శాఖ మిగితా శాఖలకు చెందిన అధికారులు ప్రజాఫిర్యాదుల విభాగానికి హాజరు కాకుండా పోతున్నారు. కేవలం సోమవారం నిర్వహించే ఫిర్యాదుల విభాగానికి ఎంపీడీఓ, తహసీల్దార్, ఎంపీఓలు మాత్రమే ముగ్గురే అధికారులు హాజరువుతున్నారు. దీంతో సోమవారం నిర్వహించిన ఫిర్యాదుల విభాగానికి ఒక దరఖాస్తు వచ్చినట్టు తహసీల్దార్ తెలిపారు. కుభీర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎంబీబీఎస్ వైద్యులను నియమించాలని దరఖాస్తులో పేర్కొన్నారు.

## సర్వేను గడువులోగా పూర్తి చేయాలి



నవతెలంగాణ-నార్నూర్

ఇందిరమ్మ ఇండ్ల సర్వేను పకడ్బందీగా నిర్వహించి, గడువులోగా పూర్తి చేయాలని ఎంపీడీఓ జవహర్‌లాల్ గ్రామపంచాయతీ కార్యదర్శులను సూచించారు. సోమవారం మండలంలోని నాగల్‌కొండ, దేవాపటార్, బలాన్‌పూర్, సోనాపూర్, గుంజాల తదితర గ్రామాల్లో సర్వే తీరును పరిశీలించారు. ఇల్లు లేని పేదలకు గుర్తించి, ఎప్పటికప్పుడు మొబైల్‌లో ఫోటో అప్‌డేట్ చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వ సూచనల మేరకు సర్వేను పూర్తి చేయాలని ఆదేశించారు. సర్వేలో కార్యదర్శులు అవినాష్, స్నేహ, రవి కుమార్, శ్రీనివాస్, రాధిక ఉన్నారు.

## ఒంటి కాలుపై నిలబడి నిరసన

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

సమగ్ర శిక్షా కాంట్రాక్టు ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నిర్మల్ ఆర్డీఓ కార్యాలయం ఎదుట చేపట్టిన నిరవధిక సమ్మె సోమవారం నాటికి 14వ రోజుకు చేరుకుంది. సమ్మెలో భాగంగా ఉద్యోగ, ఉపాధ్యాయులు జాతీయ రహదారిపై ఒంటి కాలుపై నిలబడి నిరసన తెలిపారు. తమ డిమాండ్లను పరిష్కరించాలని 14 రోజులుగా సమ్మె చేస్తున్న ప్రభుత్వం స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే దీక్షకు సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి నందిరమయ్య, టీయూసీఐ రాష్ట్ర కార్యదర్శి కే.రాజన్న, పీఓడబ్ల్యు జిల్లా కార్యదర్శి కె. లక్ష్మి, టీయూసీఐ జిల్లా నాయకులు ఎస్.గంగన్న దీక్ష శిబిరాన్ని సందర్శించి, సంఘీభావం ప్రకటించారు.



## వేస్ట్ టు వెల్త్ ప్రాజెక్టులో రాజూర విద్యార్థుల ప్రతిభ

నవతెలంగాణ-లోకేశ్వరం

వేస్ట్ టు వెల్త్ ప్రాజెక్టులో సోమవారం నిర్మల్ జిల్లాలోని 30 ఉన్నత పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ప్లాస్టిక్ వేపర్, ప్లాస్టిక్ బాటిల్స్ రీసైకిల్ చేయడం వీలు కాదని, వాటిని ఫర్నిచర్‌లో గాని, కన్స్ట్రక్షన్‌లో గాని, బెడ్స్ తయారు చేయడంలో గాని ఏ విధంగా ఉపయోగించాలో తయారు చేసి చూపించారు. ఈ ప్రాజెక్టును పరిశీలించిన డీఈఓ రామారావు, ఎన్జీసీ కోఆర్డినేటర్ మోహన్ రావు, రాజుర విద్యార్థులను, గైడ్ టీచర్ చంద్రశేఖర్‌ను అభినందించారు. ఇందులో మొదటి బహుమతి వద్యాల్ ఉన్నత పాఠశాల, రెండో బహుమతి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఈద్గాం మూడో బహుమతి రాజుర ఉన్నత పాఠశాల విద్యార్థులు పొందారు. ఈ ప్రాజెక్టు తయారు చేయడంలో పదో తరగతి విద్యార్థులు యశస్విని, మీనా, గైడ్ టీచర్‌గా బయోసైన్స్ స్కూల్ అసిస్టెంట్ జి.చంద్రశేఖర్ పాల్గొన్నారు. వీరిని రాజుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రేగుంట రాజేశ్వర్, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

## రామానుజన్ సేవలు చిరస్మరణీయం

నవతెలంగాణ-లోకేశ్వరం

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం శ్రీ అయ్యంగార్ రామానుజన్ జయంతి పురస్కరించుకొని గణిత దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు గణిత అధ్యాపకులు సాయినాథ్‌ను శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ గౌతం, అధ్యాపకులు ప్రమీల రాణి, చిన్నయ్య, మహేందర్, హరీశ్ పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేను కలిసిన కడ్తాల్ గ్రామస్తులు

నవతెలంగాణ-నిర్మల్‌రూరల్

సోన్ మండలంలోని కడ్తాల్ గ్రామస్తులు సోమవారం ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. గ్రామానికి సర్వీస్ రోడ్డు లేకపోవడంతో గ్రామస్తులకు ఇబ్బంది కలుగుతుందని పేర్కొన్నారు. ఈ సమస్యపై ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ఆయన స్పందించి ఎన్‌హెచ్ నెం.44 అధికారులతో మాట్లాడుతానని హామీ ఇచ్చారు.

## సొనాలలో జాతీయ రైతు దినోత్సవం

నవతెలంగాణ-బోథ్



మండల కేంద్రంతో పాటు సొనాలలోని వివేకానంద పాఠశాలలో సోమవారం జాతీయ రైతు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం ఇద్దరు రైతులను పిలిచి సన్మానించారు. ఈ సందర్భంగా వ్యవసాయంలో వాడే వివిధ రకాలా పనిముట్లను ఎద్దుల బండి, నాగలి, గుంటుక, అరక, కూరె, గొర్రు, పార, పారకట్టే, గొడ్డలి, గడ్డపార, దంతేలను పాఠశాలలో ప్రదర్శించారు. అలాగే అతిథులుగా వచ్చినటువంటి రైతులు వాటి ఉపయోగం గురించి విద్యార్థులకు వివరించారు. విద్యార్థులకు చదువుతో పాటు వివిధ రకాల వృత్తులపట్ల గౌరవం, వ్యవసాయం మీద అవగాహన రైతు కష్టం విలువ తెలియాలని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కృష్ణ చైతన్య, పాఠశాల డైరెక్టర్లు శుద్ధోధన్, మునిగెల శ్రీధర్, కే.నరేందర్, యాళ్ల చిన్నారెడ్డి, ఉపాధ్యాయ బృందం విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## అమిత్ షా దిష్టి బొమ్మ దహనం

నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని ఝరి గ్రామంలో బీజేపీ అధ్యక్షుడు అమిత్‌షా దిష్టి బొమ్మను సోమవారం గిరిజన నాయకులు దహనం చేశారు. ఈ సందర్భంగా ఆదివాసి నాయకుడు కుమ్ర జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ భారత రాజ్యాంగంతో పాటు ప్రపంచ మేధావి డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్‌షాను వెంటనే పార్టీ నుంచి సస్పెండ్ చేసి, పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.



బీజేపీ ప్రభుత్వానికి ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీల కులాలను వేరు చేసి చూడటమే బీజేపీ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో మండల దళిత సంఘాల నాయకులు పొచ్చన్న, మాజీ సర్పంచ్, మాజీ సర్పంచ్, మాజీ ఎంపీటీసీ పెందోర్ మహదేవ్, గ్రామ పటేల్ పెందోర్ జైతు, గ్రామస్తులు, బురుగు రాజు, మోహన్‌రెడ్డి, అరవింద్, అడెల్లు పాల్గొన్నారు.

## సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

నిర్మల్ నియోజకవర్గంలోని నిర్మల్ పట్టణం, నిర్మల్ రూరల్, సారంగాపూర్, సోన్, నర్సాపూర్, దిలావర్‌పూర్, లక్ష్మణచాంద, మామడ మండలాలకు చెందిన 220 మంది లబ్ధిదారులకు సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రూ.56లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



## మున్సిపల్ కార్మికులకు ఇండ్ల స్థలాలు కేటాయించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మున్సిపల్ కార్మికులకు ఇండ్ల స్థలాలు కేటాయించి, ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి, ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్ డిమాండ్ చేశారు. సోమవారం ఏఐటీయూసీ అనుబంధం మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మెరుగు చిరంజీవి, మంతెన కాంతారావ్‌ల ఆధ్వర్యంలో కలెక్టర్ రాజర్షిషాను కలిసి వినతిపత్రం అందజేశారు. మున్సిపల్ కార్మికులకు ఒక నెల పెండింగ్ వేతనం ఈ క్రిస్మస్ పండుగకు అందే విధంగా మున్సిపల్ కమిషనర్‌కు ఆదేశాలు జారీ చేయాలని అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో దాదాపుగా 350 మంది కార్మికులు పనిచేస్తున్నారని పేర్కొన్నారు. చుట్టుపక్కల గ్రామాలలో కార్మికులు ఉన్నారని, వారు ప్రొద్దున పని నిమిత్తం నాలుగు గంటలకు పట్టణానికి చేరుకొని పనిచేయాల్సి ఉంటుందన్నారు. వారికి వెంటనే ప్రభుత్వ భూమి కేటాయించి ఇందిరమ్మ ఇండ్లను కట్టించి ఇవ్వాలని వివరించారు. ప్రభుత్వ భూమి ఎక్కడైనా ఉంటే ఇచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని హామినిచినట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో సురేష్, శాంతమ్మ నాగరాజు, ఆనంద్, సతీష్, శంకర్, శ్రీను, అనిల్, రామ్, సునీల్ పాల్గొన్నారు.

## అర్జీలపై నిర్లక్ష్యం చెయొద్దు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

వివిధ సమస్యలపై ప్రజలు ఇచ్చే అర్జీలపై నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. సోమవారం కలెక్టర్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో ఆయన పాల్గొని అర్జీలను స్వీకరించారు. ప్రజలు వారి సమస్యలను తెలియజేస్తు దరఖాస్తులను అందించారు. వాటిని పరిశీలించి, పరిష్కరించే విధంగా చూడాలని సంబంధిత శాఖల అధికారులకు వాటిని అందించారు. కాగా మొత్తం 104 అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షిషా మాట్లాడుతూ ప్రజలు అధికారులపై నమ్మకంతో ఇచ్చే అర్జీలను పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. దరఖాస్తులను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు క్లియర్ చేయాలని సూచించారు. అర్జీలపై తీసుకుంటున్న చర్యలను దరఖాస్తుదారునికి తెలియజేయాలన్నారు. నిర్లక్ష్యం వహించే అధికారులపై చర్యలుంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ జితేందర్‌రెడ్డి, ఆర్డీఓ వినోద్ కుమార్, డీఆర్డీఓ సాయన్న, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

**ప్రజావాణిలో బోరున ఏడ్చిన మహిళ...**

తనకు ఉపాధి దూరం చేశారని ఓ బాధితురాలు సోమవారం కలెక్టరేట్‌లోని ప్రజావాణికి వచ్చి ఆవేదన వ్యక్తం చేసింది. గుడిహత్నూర్ మండలంలోని సీతాగొందికి చెందిన అనిత తెలంగాణ గ్రామీణ బ్యాంక్‌లో బ్యాంక్ మిత్రగా 10ఏండ్ల నుంచి పని చేస్తోంది. అయితే ఐకేపీ, బ్యాంక్ సిబ్బంది కుమ్మక్కై 9 నెలల నుంచి జీతం ఇవ్వకుండా తనను ఉద్యోగం నుంచి తొలగించారని బోరున ఏడుస్తూ వాపోయింది. బ్యాంక్‌కు రానివ్వడం లేదని, చంపేస్తామని బెదిరిస్తున్నారని ఆరోపించింది. బ్యాంక్ మేనేజర్ రాజు, శ్రీనివాస్‌గౌడ్ తాగొచ్చి తనను బెదిరించారని ఆమె ఆరోపించారు. తనను ముగ్గురు పిల్లలు ఉన్నారని తనకు ఉపాధి అవకాశం కల్పించాలని కలెక్టర్ తనకు న్యాయం చేయాలని కోరింది.

## మూతపడ్డ విద్యా వనరుల కేంద్రాలు

నవతెలంగాణ-తాంసి

గత 14 రోజులుగా ఎమ్మార్సీలు మూతపడ్డాయి. మండల విద్యా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో పనిచేసే సిబ్బంది సీసీఓ, ఎంఐఎస్, మెసెంజర్లు, ఐఆర్పీలు, సీఆర్పీలు, పీటీఐలు అందరూ డిసెంబర్ 10 నుంచి సమ్మెలోకి వెళ్లడంతో జిల్లాల్లోని అన్ని మండల విద్యావనరుల కేంద్రాలకు తాళం వేసి కనిపిస్తున్నాయి. మండలంలో విద్యా వ్యవస్థకు సంబంధించిన చాలా రకాల పనులు స్తంభించిపోయాయి. మధ్యాహ్న భోజనం బిల్లులు, యుడైస్ ప్లేస్ కు సంబంధించిన పనులకు సంబంధించిన పనులు పాఠశాల పర్యవేక్షణకు సంబంధించిన పనులు ఇలా మండల విద్యా వ్యవస్థలో కీలకంగా వ్యవహరిస్తున్న ఎమ్మార్సీ సిబ్బంది అంతా కూడా సమ్మెలోకి వెళ్లడంతో మండలంలో విద్యావ్యవస్థ కుంటుపడుతోందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు. కాగా వారికీ రాష్ట ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చినటువంటి హామీ మేరకు వారిని రెగ్యులరైజ్ చేయాల్సిందిగా సమ్మెలోకి వెళ్లారు. సీఎం ఇచ్చినటువంటి హామీ నెరవేరేవరకు వారు సమ్మెలో ఉంటామని సమగ్ర శిక్ష ఉద్యోగులు పేర్కొంటున్నారు.

## విద్యార్థులకు ఉచిత డెంటల్ పరీక్షలు

నవతెలంగాణ-కుభీర్

మండలంలోని నిఘ్వా గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు క్లోవ్ డెంటల్ వైద్యులు ఆకాష్ కుమార్ ఆధ్వర్యంలో సోమవారం ప్రభుత్వ పాఠశాల 65మంది విద్యార్థులకు ఉచిత డెంటల్ పరీక్షలు నిర్వహించామని అన్నారు. ఈ కార్యక్రమానికి ఎంఈఓ విజయ్ కుమార్ హాజరై మాట్లాడారు. గ్రామంలో ఉన్న ప్రతిఒక్కరూ పండ్లను శుభ్రంగా ఉంచుకునేలా చూడాలని అన్నారు. ఉదయం, సాయంత్రం పండ్లను బ్రెష్‌తో శుభ్రం చేసేకునేలా చూడాలని తెలిపారు. అదే విధంగా పంటి సమస్యలు ఉంటే వెంటనే డెంటల్ వైద్యులను సప్రదించి సమస్యను పరిష్కరించుకోవాలని అన్నారు ఆయన వెంట మాజీ ఎంపీటీసీ దొంతుల దేవిదాస్, ఎస్‌టీయూ జనరల్ సెక్రటరి నాంపెల్లి నాగభూషణం, నర్సింహాచారి, తుల శ్రీనివాస్, పోశెట్టి, సందిప్, ముత్తవ్వ ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.



# మోకాళ్లపై కూర్చొని సమగ్ర ఉద్యోగుల నిరసన

● 14 రోజుకు చేరుకున్న సమ్మె



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తమ సర్వీస్‌లను క్రమబద్ధీకరించి, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ, సమగ్ర శిక్ష ఉద్యోగులు చేపట్టిన సమ్మె 14 రోజు చేరుకుంది. సమ్మెలో భాగంగా సోమవారం కలెక్టరేట్ దీక్ష శిబిరం నుంచి ఎన్టీఆర్ చౌక్ వరకు ర్యాలీగా వెళ్లి మోకాళ్లపై కూర్చొని వినూత్న నిరసన తెలిపారు.

**రూ.15 వేల ఆర్థిక సాయం...**

దీక్ష శిబిరానికి పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థులు ప్రసన్న హరికృష్ణ, వి.నరేందర్‌రెడ్డి వేరువేరుగా హాజరై సంపూర్ణ మద్దతు ప్రకటించారు. కాగా నరేందర్‌రెడ్డి రూ.15వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో జీవన్‌రావ్, గోపాల్‌రెడ్డి, గొనె రవి, మునిందర్ ఉన్నారు.

**ఐఎఫ్టీయూ సంఘీభావం..**

గత 14 రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా సమ్మె చేస్తున్న సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, వారితో ప్రభుత్వం చర్చలు జరిపి సమ్మెను విరమింపజేయాలని ఐఎఫ్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ నారాయణ అన్నారు. గత 14 రోజులుగా ఆందోళన చేస్తూ సమ్మెలోకి దిగిన సమగ్ర శిక్ష ఉద్యోగులు సమస్యలను ఇంతవరకు ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో, విద్యాలయాల్లో ఎక్కడ సమస్యలు అక్కడ నెలకొని ఉన్నాయని అన్నారు. దీనితో విద్యార్థులు తోటి ఉద్యోగస్తులు ఇబ్బందులకు గురికావాల్సిన పరిస్థితి వస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు నర్సింగ్, దేవిదాస్, గణేష్, హరీశ్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్నాల నగేష్, వెండి భద్రేశ్వరరావు సంఘీభావం తెలిపారు.

# ఎలాంటి షరతులు లేకుండా రెగ్యులరైజ్ చేయాలి

● కలెక్టరేట్ ఎదుట ఏఎన్‌ఎంల నిరసన



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

వైద్యారోగ్య శాఖలో 23 ఏండ్ల నుంచి పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఏఎన్‌ఎంలను ఎలాంటి షరతులు లేకుండా రెగ్యులర్ చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ డిమాండ్ చేశారు. సోమవారం ఏఎన్‌ఎంలతో కలిసి కలెక్టరేట్ ఎదుట సమస్యల పరిష్కరం కోసం ధర్నా నిర్వహించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ మాట్లాడుతూ వైద్యారోగ్య శాఖలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ ఏఎన్‌ఎంలను రెగ్యులర్ చేయడానికి ప్రభుత్వం రాత పరీక్ష నిర్వహించాలని యోచిస్తుందన్నారు. ఈ సందర్భంగా వారు 23 ఏండ్లుగా చేస్తున్న పనిని గుర్తించకుండా, వారి ప్రతిభను అవహేళన చేసేలా పరీక్ష నిర్వహించడం సరికాదన్నారు. గత ప్రభుత్వం హయంలో సమ్మె సందర్భంగా టీపీసీసీ అధ్యక్షుడి హోదాలతో సీఎం రేవంత్‌రెడ్డి తాము అధికారంలోకి వస్తే ఎలాంటి షరతులు లేకుండా రెగ్యులర్ చేస్తామని హామీ ఇచ్చారన్నారు. కానీ అధికారంలోకి వచ్చి సంవత్సవరం అవుతున్న ఎలాంటి చర్యలు లేవన్నారు. ఇచ్చిన హామీ మేరకు రెగ్యులర్ చేయాలని లేని పక్షంలో ఆందోళనలు, సమ్మెలు చేపడుతామని హెచ్చరించారు. ఇది వరకే సమ్మె నోటీసు కలెక్టర్‌కు అందజేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్యారోగ్య సంఘాల పోరాట కమిటీ జిల్లా కన్వీనర్ ఎస్.నవీన్ కుమార్, ఏఎన్‌ఎంలు పుష్పల, ఆనంద బాయి, తులసి, మమత, ప్రియదర్శిని, అహల్య, జ్యోతి, అన్నపూర్ణ, కరుణ, రుక్మిణి, పుష్పలత, రామ, అశ్విని పాల్గొన్నారు.

# అగ్రి మార్కెటింగ్ విధానాల పత్రాల దహనం



నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తున్న అగ్రి మార్కెటింగ్ కొత్త విధానం ముసాయిదా పత్రాలను జాతీయ సంయుక్త కిసాన్ మోర్చా పిలుపులో భాగంగా నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఆర్డీఓ కార్యాలయం వద్ద దహనం చేశారు. ఈ సందర్భంగా ఏఐపీకేఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి నందిరామయ్య, వ్యాక సంఘం జిల్లా కార్యదర్శి నూతన్ కుమార్, ఏఐకేఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజు, టీయూసీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రాజన్న మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం, ఢిల్లీ కేంద్రంగా జరిగిన రైతు ఉద్యమ హామీలల్లో భాగంగా రద్దు చేసిన రైతు వ్యతిరేక చట్టాలను, దొడ్డి దారిన అగ్రి మార్కెటింగ్ విధానాల పేరుతో తీసుకురావడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రైతు ఉద్యమానికి దేశవ్యాప్తంగా ప్రజలందరూ మద్దతు తెలియజేశారని అన్నారు. మూడో అధికారానికి వచ్చిన మోడీ ప్రభుత్వం రైతు ఉద్యమాన్ని ఎదుర్కోలేక, ఇతర రూపాల్లో కార్పొరేట్ అనుకూల విధానాలను, వ్యవసాయ రంగం మొత్తాన్ని కార్పొరేట్లకు అప్పజెప్పడానికి జరుగుతున్న కుట్రలను ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. రైతు నాయకులు జగజిత్ సింగ్ దలేవాల్ చేస్తున్న నిరాహార దీక్షలో ఆరోగ్య పరిస్థితి క్షిణించడం ఆందోళనకరమన్నారు. తక్షణమే రైతు సంఘాలతో చర్చించాలని, రైతు పోరాటంపై అణిచివేతను ఆపాలని, గ్రేటర్ నోయిడా జైల్లో ఉన్న రైతులందరిని విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. డిమాండ్ల పరిష్కారానికి రాష్ట్రపతి ద్రౌపతి ముర్ముకు, జిల్లా కలెక్టర్ ద్వారా వినతిపత్రాన్ని పంపడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యాక సంఘం జిల్లా అధ్యక్షులు ఠాకూర్ తిరుపతి, పీఓడబ్ల్యు జిల్లా అధ్యక్షురాలు కే.లక్ష్మి, ఏఐపీకేఎస్ జిల్లా నాయకులు వర్మ గోరేబియా పాల్గొన్నారు.

# వినియోగదారులు హక్కులను తెలుసుకోవాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

వినియోగదారులు వారికి ఉన్న హక్కులను తెలుసుకోవడంతో పాటు నాణ్యమైన వస్తువులను కొనుగోళు చేసుకోవాలని వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ అన్నారు. వినియోగదారుల హక్కుల సంస్థ ఆధ్వర్యంలో సోమవారం జాతీయ కన్జుమర్ డేను నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చౌక్‌లో సంతకాల సేకరణ చేపట్టగా సీఐతో పాటు సానిటరీ ఇన్స్‌పెక్టర్ నరేందర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వారు సంతకాలు చేసిన అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ మాట్లాడుతూ మార్కెట్‌లో కల్తీ వస్తువులు అధికంగా వస్తున్న నేపథ్యంలో వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. వస్తువులు కొనుగోళు చేసే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అలాగే సామాన్లు తీసుకునే సమయలో రసీదులు తప్పనిసరిగా అడగాలన్నారు. ఎలాంటి కల్తీ, నకిలీ వస్తువులు వచ్చిన వినియోగదారుల కోర్టును ఆశ్రయించడానికి వీలుంటుందన్నారు. కార్యక్రమంలో వినియోగదారుల హక్కుల సంస్థ అధ్యక్షుడు దొమ్మటి కిరణ్ కుమార్, ఇర్ఫాన్ పాల్గొన్నారు.

## ఇంటింటికి తాగునీరు అందించడమే లక్ష్యం

నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్

పట్టణంలో ప్రతి ఇంటికి తాగునీరు అందించడమే తమ లక్ష్యమని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. అమృత్ పథకం కింద మంజూరైన నూతన తాగునీటి పైపు లైన్ పనులను సోమవారం ఆయన ప్రారంభించారు. పట్టణంలోని ఆయా వార్డుల్లో తాగునీటి సమస్య ఉన్న నేపథ్యంలో పనులను ప్రారంభించినట్టు తెలిపారు. మిషన్ భగీరథ పేరుతో గత ప్రభుత్వం వేసిన పైపు లైన్ ప్రజలకు తాగునీటి సమస్యను తీర్చకుండా నిధులను దుర్వినియోగం చేసిందన్నారు. నుతన పైపు లైన్ ఏర్పాటుతో పట్టణంలో తాగునీటి సమస్య తీరనుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ చిన్నం సత్యం, వైస్ చైర్మెన్ కావలి సంతోష్, నాయకులు దొనికెని దయానంద్, నిమ్మల రమేష్, పరిమి సురేష్, షబ్బీర్ పాషా, కమీషనర్ మనోహర్ పాల్గొన్నారు.



## అపర చాణక్యుడు పీవీ నరసింహారావు



నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

అపర చాణక్యుడు, దేశానికి సుస్థిర పాలనను అందించిన ప్రధాని పీవీ నరసింహారావు అని టీపీసీసీ ప్రచార కమిటీ జాయింట్ కన్వీనర్ ఎంబడి రాజేశ్వర్ అన్నారు. సోమవారం నిర్మల్ పట్టణంలో పీవీ నరసింహారావు వర్ధంతిని పురస్కరించుకొని పట్టణంలోని శాంతినగర్ చౌరస్తాలో పీవీ నరసింహారావు విగ్రహానికి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నాందేడపు చిన్నూ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ దేశాన్ని ఆర్థిక సంక్షోభం నుంచి విముక్తి కల్పించిన గొప్ప మేధావి పీవీ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సారంగాపూర్ మార్కెట్ కమిటీ చైర్మెన్ అబ్దుల్ హదీ, పట్టణ మైనార్టీల అధ్యక్షుడు మతిన్, దేవరకోట దేవస్థానం చైర్మెన్ కొండ శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు హర్షత్ నాయకులు పాల్గొన్నారు.

## పకడ్బందీగా సర్వే నిర్వహించాలి



నవతెలంగాణ-నిర్మల్‌రూరల్

ఇందిరమ్మ ఇండ్ల సర్వేను సిబ్బంది పకడ్బందీగా నిర్వహించాలని దిలావర్‌పూర్ ఎంపీఓ గోవర్ధన్ అన్నారు. సోమవారం మండలంలోని న్యూలోలం గ్రామంలో నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇండ్ల సర్వేను వారు పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా సర్వే పూర్తి చేయాలన్నారు. అదేవిధంగా ఇంటి పన్నులను ఎప్పటికప్పుడు వసూలు చేయాలని, పంచాయతీ కార్యదర్శికి సూచించారు.

## ఆదిలాబాద్ నుంచి వరంగల్‌కు బస్ సర్వీస్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ నుంచి వరంగల్ వరకు ప్రత్యేక బస్సు సర్వీసును మంగళవారం నుంచి ప్రారంభిస్తున్నట్టు ఆర్టీసీ డిపో మేనేజర్ కల్పన సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ బస్సు ప్రతిరోజు రాత్రి 9గంటలకు ఆదిలాబాద్ నుంచి బయలుదేరి ఉట్నూర్, జన్నారం, లక్షెటిపేట, కరీంనగర్ మీదుగా వరంగల్‌కు ఉదయం 4 గంటలకు చేరుకుంటుందని పేర్కొన్నారు. అలాగే వరంగల్ నుంచి ఉదయం 10 గంటలకు బయలుదేరి సాయంత్రం 5:15 అదిలాబాద్ చేరుకుంటుందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు వినియోగించుకోవాలని కోరారు. సురక్షితమైన ప్రయాణానికి ఆర్టీసీలో ప్రయాణం చేయాలన్నారు.

## పురుగుమందుల పిచికారిలో జాగ్రత్తలు పాటించాలి

నవతెలంగాణ-తాంసి

వివిధ పంటలపై క్రిమీసంహారక మందుల పిచికారి చేసే సమయంలో తగు జాగ్రత్తలు పాటించాలని కోరమాండల్ కంపెనీ టెరిటరీ మేనేజర్ సతీష్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ వారి ఆధ్వర్యంలో స్టీవర్డ్‌షిప్ డే సందర్భంగా రైతులు తీసుకోవాల్సిన జాగ్రతలపై వివరించారు. రైతులకు సేఫ్టీ కిట్స్ అందించారు. పురుగుమందులు పిచికారి చేసేటప్పుడు మత్తు పదార్థాలు, గుట్కా, సిగరెట్లు, బీడి, తాగడం వంటివి చేయవద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో తాంసి మండల అగ్రికల్చర్ ఆఫీసర్ రవీందర్, పురుగుమందుల డీలర్ రజనీకాంత్ రెడ్డి, రైతులు గంగారెడ్డి, సి.ఉమకాంత్ రెడ్డి, శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

## పర్యావరణ హితంగా పెండ్లి కార్యం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రస్తుతం పెండ్లీలు, ఇతర శుభకార్యాలయాల్లో విచ్చలవిడిగా ప్లాస్టిక్ వినియోగిస్తు పర్యావరణానికి హానీ కలిగిస్తున్న క్రమంలో ఆదిలాబాద్ పట్టణానికి చెందిన ఓ వ్యక్తి తన కుమారిడి పెండ్లికి పర్యావరణ హిత వస్తువులను వినియోగిస్తున్నారు. పట్టణంలోని పాతహౌజింగ్ బోర్డు కాలనీకి చెందిన గిరిష్ కౌటిక్వార్ స్థానిక ఆకాశవాణిలో ఇంజనీరింగ్ విభాగంలో పని చేస్తున్నాడు. తన కుమారుడి పెండ్లి సందర్భంగా పసుపు బొట్టు కార్యక్రమంలో ప్లాస్టిక్ వస్తువులను కాకుండా వెదురు బుట్టలను వినియోగించి ఆదర్శంగా నిలిచారు. ఈ సందర్భంగా గిరిశ్ మాట్లాడుతూ పర్యావరణానికి హాని కలిగించకుండా తన కుమారుడి పెండ్లి జరిపించాలని ప్లాస్టిక్‌ను వినియోగించడం లేదన్నారు. వాతావరణంలో కాలుష్యాన్ని నివరించడంలో భాగంగా తొలి అడుగుగా తమ వంతుగా సహజ సిద్ధమైన వస్తువులను వినియోగిస్తున్నామని తెలిపారు.

## గెలుపే ధ్యేయంగా ముందుకు సాగాలి

నవతెలంగాణ-భైంసా

స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా ముందుకు సాగాలని శక్తి కేంద్ర ఇన్‌చార్జ్ మహిళ మోర్చా నాయకురాలు సిరం సుష్మరెడ్డి అన్నారు. భైంసా మండలంలోని వానల్‌పాడ్, తిమ్మాపూర్ గ్రామాల్లో బూత్ కమిటీలను ఎన్నుకున్న సందర్భంగా ఆమె మాట్లాడారు. బూత్‌స్థాయి కమిటీలే పార్టీకి పట్టుకొమ్మలని, గ్రామ గ్రామాన కమిటీలు బీజేపీ బలోపేతానికి కృషి చేస్తామని అన్నారు.

**బూత్ కమిటీ అధ్యక్షుల నియామకం..**

తిమ్మాపూర్ గ్రామంలో 88వ బూత్ కమిటీ అధ్యక్షునిగా నాగులపల్లి రామరావ్, 87వ బూత్ కమిటీ అధ్యక్షునిగా దుబాయ్ శ్రీను, వానల్‌పాడ్ గ్రామంలో 95వ బూత్ కమిటీ అధ్యక్షునిగా రాజ్ కుమార్, 96వ బూత్ అధ్యక్షునిగా రామ్ పటేల్, కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమాల్లో మాజీ ఎంపీటీసీ అశోక్, మాజీ సర్పంచ్ రమేష్, నాయకులు చందర్ పటేల్, సాయారెడ్డి ఉన్నారు.

## మాణిక్ గూడ పరిసర ప్రాంతాల్లో చిరుత సంచారం

నవతెలంగాణ-ఆసిఫాబాద్



మండలంలోని మాణిక్ గూడ పరిసర ప్రాంతాల్లో చిరుత పులి సంచరిస్తున్నట్టు ఆసిఫాబాద్ ఎఫ్ఆర్ఓ గోవింద్ చంద్ సర్దార్ తెలిపారు. అటవీశాఖ అధికారులు గ్రామ పరిసర ప్రాంతాల్లోనీ అటవీలో చిరుత పులి అడుగులు గుర్తించినట్లు వివరించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, సాయంత్రం పూట అటవీ పరిసర ప్రాంతాల్లోకి వెళ్లకూడదన్నారు. పత్తి ఏరే రైతులు శబ్దాలు చేసుకుంటూ చేన్లలో పని చేయాలన్నారు. చేన్లలో ఎవరు కూడా కరెంటు వైర్లు వేయకూడదని అలా చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎక్కడైనా చిరుత పులి లేదా పులి కనిపిస్తే వెంటనే తమకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ అధికారి యోగేష్, బీట్ అధికారి రాజేష్, అనిమల్ ట్రాకర్ సిబ్బంది పాల్గొన్నారు.

## పోడు భూముల సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-బెజ్జూర్



పోడు భూముల సమస్యలు పరిష్కరించాలని మండలంలోని లంబాడిగూడ గ్రామపంచాయతీ రైతులు భూక్యా సంతోష్ నాయక్ కోరారు. ఈ మేరకు సోమవారం ఐటీడీఏ పీఓ కుష్బూ గుప్తాకి వినతిపత్రం అందజేశారు. పోడు భూముల సమస్యల గురించి విన్నవించగా పీఓ సానుకూలంగా స్పందించి సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. ఇందులో గ్రామస్తులు ఆత్రం సకారం, కోరేత శ్రీనివాస్, కుమురం లచ్చయ్య పొట్టి మారయ్య పాల్గొన్నారు.

## అమిత్‌షా దిష్టిబొమ్మ దహనం



నవతెలంగాణ-రెబ్బెన

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై పార్లమెంట్‌లో అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా దిష్టిబొమ్మను దళిత బహుజన మైనారిటీ సంఘాల ఆధ్వర్యంలో దహనం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాజకీయ వేత్త, సంఘ సంస్కర్త, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై పార్లమెంట్‌లో అమిత్ షా వ్యాఖ్యలు అగ్రవర్ణ భావజాలానికి నిదర్శనమన్నారు. ఆర్ఎస్ఎస్, బీజేపీ అంతర్గత ఆలోచన బయటపడిందని తెలిపారు. అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్ షా బహిరంగ క్షమాపణ చెప్పాడంతో పాటు తన పదవీకి రాజీనామ చేయాలని, ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం అధ్యక్షులు మండల కోబ్రాఘడే మొండి, మాజీ జడ్పీటీసీ దుర్గం సోమయ్య, వేముర్ల సంతోష్, పెసరి మధునయ్య, మాజీ సర్పంచ్లు లెందుగురే గంటమేర, ముంజం రవీందర్, వేముర్ల వెంకటేష్, రత్నం వెంకటి మాజీ ఉపసర్పంచ్ బొమ్మినేని శ్రీధర్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు లవుడ్యా రమేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దుర్గం దేవాజీ, కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షులు రత్నం ఆనందరావు, బీఆర్ఎస్ నాయకులు దుర్గం భరద్వాజ్, వినోద్ జైస్వాల్, దుర్గం భిక్షపతి, మైనారిటీ నాయకులు ఉబేదుల్లా, అంబేద్కర్ సంఘం నాయకులు ముంజం శ్యామ్ రావు, దుర్గం రాజేష్ పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



నవతెలంగాణ-పెంచికల్‌పేట్

పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని మండలం ప్రత్యేక అధికారి, ఇరిగేషన్ ఈఈ ప్రభాకర్ అన్నారు. సోమవారం మండలంలోని చెడువాయి జిల్లా పరిషత్ పాఠశాల, ఎల్లూరు ప్రాథమిక పాఠశాల, కోయ చిచ్చాలా ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలు, కేజీబీవీ పాఠశాలలను సందర్శించారు. పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజనం, పిల్లలకు అందిస్తున్న బియ్యం, కూరగాయలను పరిశీలించారు. మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో విద్యార్థినులకు చలికాలం దృష్ట్యా బ్లాంకెట్స్ పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, పారిశుధ్యంపై సూచనలు చేశారు. మండలంలోని బొంబాయి గూడ, గుండ్లపేట, పోతేపల్లి, దర్గపల్లి, చేడువాయి గ్రామపంచాయతీలలో జరుగుతున్న ఇందిరమ్మ ఇండ్ల సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు పోషకహారం అందిచాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అల్బర్ట్, మండల విద్యాధికారి రమేష్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## ఘనంగా అయ్యప్ప స్వాముల ఇరుముడి వేడుక

నవతెలంగాణ-ఆసిఫాబాద్



41 రోజుల మండల దీక్ష పూర్తి చేసుకుని శబరిమలై వెళ్తున్న స్వాములకు జిల్లా కేంద్రంలోని అయ్యప్ప ఆలయంలో గురుస్వామి ముసునూరి సూర్య భాస్కర శర్మ ఆధ్వర్యంలో ఇరుముడి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఐదుగురు స్వాములకు ఇరుముడి కట్టి తలపై ధరించారు. అనంతరం ఆలయ ఆవరణలో అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వేణుగోపాల్, వెంకట్ గౌడ్, కోశాధికారి చంద్రమోహన్, గురుస్వాములు మోహన్, బాల ప్రసాద్, స్వాములు శ్రీధర్, రమేష్, ఆశిష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ఘనంగా గణిత దినోత్సవ వేడుకలు



నవతెలంగాణ-కౌటాల

శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకొని జడ్పీహెచ్ఎస్ గుండాయిపేట్ పాఠశాలలో జాతీయ గణిత దినోత్సవాన్ని ప్రధానోపాధ్యాయులు జి.నానాజీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవుని నిత్యజీవితంలో గణితం ప్రాధాన్యత, పిల్లలు గణితం పట్ల పెంపొందించుకోవాల్సిన ఆసక్తిని శ్రీనివాస రామానుజన్ గురించి వివరించారు. ఆయన ఒక నిరుపేద కుటుంబంలో పుట్టి, ప్రపంచం గర్వించదగ్గ గణిత శాస్త్రవేత్తగా ఎదిగిన తీరును కొనియాడారు. అనంతరం నిర్వహించిన గణిత మేళా ఆకట్టుకుంది. ఈ సందర్భంగా గణిత ఉపాధ్యాయులు జే.మనోహర్‌ను సన్మానించారు. కార్యక్రమంలోఉన్నత ప్రాథమిక పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# గోలేటిలో సింగరేణి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

నవతెలంగాణ-రెబ్బెన



బెల్లంపల్లి ఏరియాలోని గోలేటిలో శ్రీ భీమన్న మైదానంలో సింగరేణి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. సోమవారం శ్రీ భీమన్న మైదానంలో బెల్లంపల్లి ఏరియా జీఎం ఎం.శ్రీనివాస్ సింగరేణి జెండాను ఎగరవేసి సింగరేణి గీతాన్ని ఆలపించారు. అనంతరం సింగరేణి తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నూతనంగా ఏర్పాటుచేసిన ఓపెన్ జిమ్, సింగరేణిలో ఏర్పాటుచేసిన స్టాళ్లను ప్రారంభించారు. ఖైర్‌గూడ స్టాల్‌ను బొగ్గు తీసే విధానాన్ని క్లుప్తంగా వివరించే విధంగా ఏర్పాటు చేసిన అధికారులు, ఉద్యోగులను అభినందించారు. అనంతరం సింగరేణి 136వ సింగరేణి ఆవిర్భావ వేడుకలను కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ 1920లో కొత్తగూడెంలో డెక్కన్ కంపెనీ సింగరేణి కంపెనీగా ఆవిర్భవించిందన్నారు. సింగరేణి అధికారులు, ఉద్యోగులు, కార్మికులకు ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిందని తెలిపారు. కారుణ్య నియామకాల ద్వారా ప్రభుత్వం2165 ఉద్యోగాలు వారి పిల్లలకు ఇవ్వడం జరిగిందన్నారు. బెల్లంపల్లి ఏరియాలో 2024-2025 మార్చి నాటికి 38 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించాల్సి ఉండగా ఇప్పటికీ 22 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించామన్నారు. వచ్చే మూడు నెలలలో 16 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించి 100శాతం బొగ్గు ఉత్పత్తి సాధించగలుగుతామన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు ఎస్.తిరుపతి, ఎస్ఓ టూ జీఎం రాజమల్లు, ఏజీఎం భీంరావు జాడే, ఉజ్వల్ కుమార్ బెహరా, పర్సనల్ మేనేజర్ రెడ్డి మల్ల తిరుపతి, సెక్యూరిటీ ఆఫీసర్ ఉమాకాంత్, గోలేటి సీహెచ్‌పీ ఎస్ఈ కోటయ్య, సేవా అధ్యక్షురాలు ఉమారాణి శ్రీనివాస్, సీనియర్ సేవా సభ్యురాలు కుందారపు శంకరమ్మ, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# ఘనంగా జాతీయ రైతు దినోత్సవం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

మండలంలోని కొమ్ముగూడ గ్రామంలో మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో జాతీయ రైతు దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. మొదటగా గ్రామంలో ర్యాలీ నిర్వహించినంతరం జాతీయ రైతు జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశానికి వెన్ను ముక రైతులేనని, రైతు లేనిది రాజ్యం లేదన్నారు. రైతులు పండించే పంటలకు గిట్టుబాటు ధర లేక చాల మంది అప్పుల పాలవుతున్నారని, రైతుల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మరిన్ని సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. రైతులకు రాయితీపై ఎరువులను పంపిణీ చేసి, రైతు పండించే పంటకు గిట్టుబాటు ధరలు పెంచాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారికంగా జాతీయ రైతు దినోత్సవ వేడుకలను జరిపించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం నాయకులు మిట్ట వెంకన్న, గడ్డల సురేష్, గాజుల జక్కయ్య, మనిగొండ వెంకన్న, గడ్డల శంకర్, ఆడప సతీష్, అనిశెట్టి సదశివ్, రుకుం ప్రహ్లాద్, చిలుకూరి శంకర్, బలదరపు మధుకర్, పుదరి నారాయణ, గజ్జెల వినోద్, గంధం శంకర్, రుకుం తిరుపతి, మేకర్తి శ్రీనివాస్, ఎరువోతూ రామన్న, మరిశెట్టి రాజన్న, రుకుంమ్ ప్రసాద్, కుందరుపు మహేష్, ఉప్పరి శ్రీశైలం, గడ్డల మల్లయ్య, ఎరువోతు అశోక్, మరిశెట్టి రవి, గడ్డల మహేష్ పాల్గొన్నారు.

# కాంట్రాక్ట్ కార్మికుల పట్ల యాజమాన్యం వివక్షత

నవతెలంగాణ-రెబ్బెన



కాంట్రాక్ట్ కార్మికులు పట్ల సింగరేణి యాజమాన్యం వివక్షత తగదని ఎస్‌సీకేఎస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దూలం శ్రీనివాస్, మధు అన్నారు. సింగరేణి యాజమాన్యం సింగరేణి కాంటాక్ట్ కార్మికులను బానిసలుగా, రెండవ తరగతి పౌరులుగా చూస్తూ అడుగడుగునా వివక్షత పాటిస్తుందని ఆరోపించారు.సింగరేణి డే సందర్భంగా సమస్యలను పరిష్కారించాలని నిరసనలు తెలిపారు. కాంట్రాక్ట్ కార్మికుల వేతనాల పెంపు, చట్టబద్ధ సౌకర్యాల అమలుకు అనేక సంవత్సరాలుగా వినతిపత్రాలు ఇస్తున్న పట్టింపు లేదన్నారు. 2022 సెప్టెంబరు 26న 18 రోజుల సమ్మె సందర్భంగా జరిగిన ఒప్పందాన్ని సైతం సింగరేణి యాజమాన్యం అమలు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. తాముగెలిస్తే నెల రోజుల్లో వేతనాలు పెంచుతామని కోల్ బెల్ట్ ఏరియాలో గెలిచి, కాంగ్రెస్ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిందన్నారు. ప్రభుత్వంఏర్పడి సంవత్సరం గడిచిన నేటికీ కాంట్రాక్టు కార్మికుల వేతనాల పెంపుదలపై కనీస ప్రకటన చేయలేదని మండిపడ్డారు. సింగరేణి కాంట్రాక్టు కార్మికులందరూ తమ సమస్యల పరిష్కారం కోసం రాజకీయాలు, సంఘాలకు అతీతంగా ఉద్యమించి హక్కులు సాధించుకోవాలన్నారు.

# పంట తెగులు గుర్తింపుకు ప్రత్యేక యాప్




నవతెలంగాణ-ఆసిఫాబాద్

రైతులు పంట తెగులు సులువుగా గుర్తించడానికి జాతీయ ఇంటిగ్రేటెడ్ బెస్ట్ మేనేజ్‌మెంట్ సెంటర్ ఆధ్వర్యంలో ప్రత్యేక అప్లికేషన్ తీసుకొచ్చినట్టు ప్లాంట్ ప్రొటెక్షన్ అధికారి సునీత తెలిపారు. రైతులకు అప్లికేషన్ వినియోగంపై పంట తెగులు గుర్తింపుపై ప్రగతిశీల రైతులకు జిల్లా కేంద్రంలో జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి ప్రొటెక్షన్ అధికారి వెంకట్ రెడ్డి, అసిస్టెంట్ ప్రొటెక్షన్ అధికారి హన్సప్ప గౌడ్‌తో కలిసి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంటలకు తెగుళ్లు పెరుగుతున్న నేపథ్యంలో ఈ అప్లికేషన్ ద్వారా తొందరగా తెగులును గుర్తించి సరైన మందు వేసే అవకాశం ఉంటుందన్నారు. రైతులు దీనిని వినియోగించుకోవాలని సూచించారు. నేషనల్ ఫెస్ట్ సర్వైలెన్స్ సిస్టం మొబైల్ అప్లికేషన్ ద్వారా తెగుళ్ల నిర్ధారించి నివారించవచ్చన్నారు. అనంతరం క్షేత్రస్థాయిలో అప్లికేషన్ వినియోగంపై ప్రదర్శనతో తెలియజేశారు. అప్లికేషన్ వినియోగంపై రైతులు సంతోషం వ్యక్తం చేశారు. పంట తెగుళ్ళ నివారణలో ఇది తమకు తోడ్పడుతుందన్నారు. కార్యక్రమంలో ఏడీ మిలింద్ కుమార్, మండల ఎంఏఓ, అన్ని క్లస్టర్ల ఏఈఓలు పాల్గొన్నారు.

# అడవులను ధ్వసం చేస్తే కఠిన చర్యలు

నవతెలంగాణ-కెరమెరి

అడవులను ధ్వంసం చేస్తే కఠిన చర్యలు తప్పవని ఎఫ్ఆర్ఓ మజారోద్దీన్ అన్నారు. అడవుల సంరక్షణపై సోమవారం మండలంలోని ఝరి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడవులను సంరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అడవులతోనే మానవ మనుగడ సాధ్యమన్నారు. అటవీ జంతువుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టనున్నట్టు తెలిపారు. గ్రామస్తులకు అటవీ జంతువుల పరిరక్షణపై అవగాహన కల్పించారు. అడవుల సంరక్షణకు ఎప్పటికప్పుడు పటిష్టమైన చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. ఎవరైనా అక్రమంగా కలప తరలిస్తే తమకు తెలియజేయాలన్నారు. అటవీ ప్రాంతంలో నిప్పు పెట్టకూడదని అది పర్యావరణానికి ముప్పు కలిగిస్తుందని అన్నారు. అటవీ జంతువుల సంరక్షణ వల్ల పర్యావరణ సమతుల్యం సాధ్యమవుతుందని తెలిపారు. పంట పొలాల్లో పత్తి, కంది కర్రలను చేన్లలో కాల్చే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.



ఎవరైన నిబంధనలు ఉల్లంఘిస్తే చట్ట ప్రకారంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీట్ ఆఫీసర్ రామయ్య, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులు త్వరగా పరిష్కరించాలి

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించే విధంగా అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో ఆసిఫాబాద్ ఆర్డీఓ లోకేశ్వరరావు, డీఆర్డీఓ దత్తరావుతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను సంబంధిత అధికారుల సమన్వయంతో త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటారని తెలిపారు. మండల ప్రత్యేక అధికారులు ఉత్తమ మండలంలో గల ఆశ్రమ పాఠశాలలు, గురుకులాలు, సంక్షేమ వసతి గృహాలు, పాఠశాలలను తరచుగా సందర్శించి అవసరమైన వసతులు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## కల్వర్టు వద్ద మరమ్మతులేవి..?



నవతెలంగాణ-కెరమెరి

మండలంలోని సాంగ్వీ నుంచి ఇందాపూర్ వెళ్లే మార్గంలో ఇంద్రనగర్ అగర్వాడ గ్రామాల మధ్య ఉన్న కల్వర్టు వద్ద ప్రమాదం పొంచి ఉందని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు భీంరావు అన్నారు. సోమవారం ప్రమాదం పొంచి ఉన్న ప్రదేశాన్ని సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో కురిసిన భారీ వర్షాలకు తారు రోడ్డు కోతకు గురైంది. కల్వర్టు వద్ద పెద్ద గొయ్యి ఏర్పడి, పైపులు బయట పడ్డాయన్నారు. రెండేళ్ళ అవుతున్న ఎవరు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ప్రతి రోజు రాకపోకలు కొనసాగించే వాహనదారులు ఆ ప్రదేశం వద్ద ఇబ్బదులు పడుతున్నారన్నారు. ఎదురుదురుగా వాహనాలు వచిన్నప్పుడు ప్రక్కకు వాహనాలు నిలుపుకునేందుకు వీలులేని పరిస్థితి నెలకొందని తెలిపారు. వాహనదారులు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉండడంతో అధికారులు స్పందించి కల్వర్టు వద్ద మరమ్మత్తులు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు పోశెట్టి, గణపతి పాల్గొన్నారు.

## ప్రత్యేక స్థానాన్ని ఏర్పచుకోవాలి



నవతెలంగాణ-సిర్పూర్(టీ)

విద్యార్థులు విద్యతో పాటు సమాజంలో తమ చుట్టూ జరుగుతున్న విషయాలను అలవర్చుకోవడం అభిరుచిగా చేసుకొని సమాజంలో తమకంటూ ఒక స్థానాన్ని ఏర్పాటుకు కృషి చేయాలని ఎస్సై కమలాకర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో కళాబృందం సభ్యులు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండని బాలబాలికలు బాల్యవివాహాలు చేసుకోకూడదని, ఇది చట్టరీత్యా నేరమన్నారు. ట్రాఫిక్ నిబంధనలు,డ్రగ్స్, సైబర్ క్రైమ్ అలాగే డ్రైవింగ్ లైసెన్స్ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ లైసెన్స్ తీసుకొని వాహనాలను నడపాలన్నారు. విద్యార్థులు రాసిన కవితలు, పద్యాలు, డ్రాయింగ్ చూసి అభినందించారు. కార్యక్రమంలో జిల్లా గురుకులాల సమన్వయ అధికారి డి.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు సుమన్, గణేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో ప్రజలకు అవగాహన



నవతెలంగాణ-పెంచికల్‌పేట్

మండలంలోని బొంబాయి గూడ, ఎర్రగుంట, పోతపెల్లి, కొండపల్లి గ్రామాల ప్రజలకు అటవీ శాఖ అధికారులు అవగాహన కల్పించారు. గ్రామల సమీప అడవిలో పెద్దపులి సంచరిస్తున్న కారణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా చేన్లు, పొలాల వద్ద గ్రామాల్లో ఉన్న ప్రజలకు పలు సూచనలు చేశారు. ప్రజలు అడవిలోకి వెళ్లకూడదని, అడవి సమీప చేనులకు ఒంటరిగా పనులకు వెళ్లకూడదని, గుంపులు గుంపులుగా శబ్దాలు చేసుకుంటూ పనులకు వెళ్లాలన్నారు. ఉదయం 10 గంటల తర్వాత పనులకు వెళ్లి సాయంత్రం నాలుగు గంటలలోపే పనులు ముగించుకొని ఇంటికి రావాలని, ఎవరికైనా పులి జాడ కనపడితే అటవీశాఖ అధికారులకు తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో ఫారెస్ట్ బీట్ అధికారి సతీష్, అరవింద, అరవింద్ నాయక్ పాల్గొన్నారు.

## జీతంపై విరక్తితో ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-నస్పూర్



తాగుడుకు బానిసై జీవితంపై విరక్తితో ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన సీసీసీ నస్పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ సుగుణాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. మున్సిపాలిటీ పరిధిలోని అంబేద్కర్ కాలనీకి చెందిన కోయల శ్రీనివాస్(43) తాగుడుకు బానిసై ఆరోగ్యం క్షీణించింది. అనారోగ్యంతో ఏ పని చేయలేనని మనస్తాపంతో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య కు పాల్పడ్డారని తెలిపారు. భార్య రూప ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

## సీసీ రోడ్డు నిర్మాణం చేపడుతాం

- ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి

నవతెలంగాణ-జైపూర్



కోటపల్లి మండలం పారుపల్లి గ్రామ శివారులో వెలసిన కాలభైరవ ఆలయం వరకు సీసీ రోడ్డు నిర్మిస్తామని చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. సోమవారం కాలభైరవ జయంతి ఉత్సవాలకు హాజరైన ఆయన స్థానికుల అభ్యర్థన మేరకు ఎండోమెంట్ అధికారులతో మాట్లాడి ఆలయంలో అర్చకులను నియమించడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. జయంతి ఉత్సవాలకు హాజరైన ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామికి వేదపండితులు పూర్ణ కళశంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కాలభైరవ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## భూమికి దొంగ పత్రాలు సృష్టించారు

- యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మారం రాజ్‌కుమార్



నవతెలంగాణ-కాసిపేట

తమ భూమిపై దొంగ పత్రాలు సృష్టించి మాకు అన్యాయం చేయాలని చూస్తున్నారని ముత్యంపల్లికి చెందిన యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మారం రాజ్ కుమార్ అధికారులకు విన్నవించారు. సోమవారం కాసిపేట మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఎంపీడీఓ సత్యనారాయణ సింగ్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని కోమటిచేను శివారులోని 131 సర్వే నెంబర్‌లోని 9.1 ఎకరాలు, మా తాత మారం మొండి పేరు మీద గత 70 ఏళ్లగా సాగులో ఉందని, తాత చనిపోయిన తర్వాత తన కొడుకులు, మనవళ్లు సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామన్నారు. ఇప్పుడు కొంత మంది కాసిపేట గ్రామ పంచాయతీకి చెందిన ఇద్దరు కాంగ్రెస్ నాయకులు మా పాలివాళ్లతో కుమ్మక్కై, కాంగ్రెస్ కార్యకర్తనైన నన్ను, నా కుటుంబాన్ని జీవనాధారంగా ఉన్న భూమిని దొంగ పత్రాలు సృష్టించి మాకు అన్యాయం చేయాలని చేస్తున్నారన్నారు. ఈ విషయమై ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లడం కూడా జరుగుతుందన్నారు. భూమి సర్వే చేసి నిజమైన వారసులను గుర్తించి పట్టా పాస్ బుక్ జారీ చేసి న్యాయం చేయాలని కోరారు.

## గుడిసె వాసులకు పట్టాలిచ్చి సౌకర్యాలు కల్పించాలి

నవతెలంగాణ-నస్పూర్



చెన్నూరు మండలం బాబురావుపేట శివారు సర్వే నెంబర్ 8లో పేదల గుడిసెలు వేసుకొని రెండు సంవత్సరాలుగా ఉంటున్న వారికి సౌకర్యాలు కల్పించాలని సీపీఐ(ఎం) ఏరియా కార్యదర్శి బోడెంకి చందు డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి ఏఓ రాజేశ్వరరావుకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఇస్తానన్న హామీలో ఇందిరమ్మ ఇళ్లు మొదటి ప్రాధాన్యతగా గుడిసె వాసులకు ఇవ్వాలని, పట్టాలు, కనీస సౌకర్యాలు మంచినీరు, విద్యుత్, రోడ్లు కల్పించి పేద ప్రజలకు న్యాయం చేయాలన్నారు. స్వాతంత్రం వచ్చి 76 సంవత్సరాల గడిచిన పేదలు జానెడు జాగ కోసం పోరాటం చేస్తున్నారంటే, పాలకులు పేదల అభివృద్ధి పట్ల ఏంత శ్రద్ధ ఉందో అర్థం అవుతుందని అన్నారు. ఎన్ని ప్రభుత్వాలు మారిన పేదల జీవితాలు మారడం లేదని కాబట్టి తక్షణమే ప్రభుత్వ యంత్రాంగం, అధికారులు గుడిసె వాసులకు పట్టాలు, ఇందిరమ్మ ఇల్లు, కనీస సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) నాయకులు శ్యామల, ఉమారాణి, సిడం సమ్మక్క, నాగజ్యోతి, రవి, శారద, బోర్ల సరిత, రాజేశ్వరి, పాయిరాల రాములు, రమాదేవి, రేణుక, యామిని, కుమార్, మధుకర్ పాల్గొన్నారు.

## విద్యార్థికి రాష్ట స్థాయి ర్యాంకు



నవతెలంగాణ-జన్నారం

ప్రముఖ గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా హైదరాబాదులో నిర్వహించిన రాష్ట్ర స్థాయి 'గణిత ప్రతిభా' పరీక్షలో మండలంలోని కలమడుగు జడ్పీఎస్ఎస్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థి షేక్ అశ్వక్ రాష్ట్రస్థాయిలో నాలుగో స్థానం సాధించారు. దీంతో విద్యార్థి అశ్వక్‌తో పాటు గైడ్ ఎం.తిరుపతిని సోమవారం పాఠశాలలో హెచ్ఎం కట్ట రాజమౌళి ఉపాధ్యాయులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవాలి

నవతెలంగాణ-జన్నారం

కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ ఇండియన్ ఇనిస్ట్యూటూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ (సీఎస్ఐఆర్)లో ఉద్యోగాలకు ఆసక్తిగల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని జన్నారం ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్ బండి రాములు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆ ఉద్యోగాలకు ఐటీఐ పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులన్నారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు ఆ సంస్థ వెబ్‌సైట్ లింక్ ద్వారా ఆన్‌లైన్‌లో నిజ ధ్రువీకరణ పత్రాలు సమర్పించి 26లోపు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ కోరారు. ఆసక్తి గల అభ్యర్థులు మండల కేంద్రంలోని ఐటీఐ కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

## పాఠశాలలో ఘనంగా రైతు దినోత్సవం



నవతెలంగాణ-లక్షెట్టిపేట

శ్రీ చైతన్య టెక్నో పాఠశాలలో జాతీయ రైతు దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. భారతదేశ 5వ ప్రధానమంత్ర చౌదరి చరణ్ పుట్టిన రోజు సందర్భంగా సోమవారం ఈ జాతీయ రైతు దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యకనుంలో విద్యార్థులు రైతు శేషధారణలతో అలరించారు. రైతుల గొప్ప తనాన్ని ఉపన్యాసం, పాటలు, నృత్యాల చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ అశ్విని మాట్లాడుతూ రైతు పడే కష్టాలను, వారి గొప్ప తనాన్ని తన ఉపస్యాసం ద్వారా తెలియజేస్తూ, రైతు వేషధారణలో ఉన్న విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డీన్ వి శ్రీనివాస్, ప్రీ ప్రయిమరీ ఇన్‌చార్జి శైలజ, పీపీటీ ఇన్‌చార్జి శిరీష, పీఈటీ కిషన్ గౌడ్, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ సమస్యలు పరిష్కరించాలి

- పట్టణంలో రోడ్డు వెడెల్పు చేసి డివైడర్ నిర్మించాలి



నవతెలంగాణ-లక్షెట్టిపేట

పట్టణంలో ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించాలని, పట్టణంలో రోడ్డు వెడెల్పు చేసి మధ్యలో డివైడర్ నిర్మించాలని అంబేద్కర్ యువజన సంఘం పట్టణ అధ్యక్షుడు తొగరు రాజు డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రధాన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ చైర్మన్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ కరీంనగర్ నుంచి ఇటిక్యాల వరకు నాలుగు వరుసల రహదారి నిర్మించాలన్నారు. ఉత్కూర్‌లో గురువారం నిర్వహిస్తున్న వార సంత వేరే చోటికి తరలించాలన్నారు. అంబేద్కర్ చౌరస్తా నుండి గోదావరి వరకు ఆక్రమించిన షాపులు తొలగించి, రోడ్డు వెడెల్పు చేయాలని, అంబేద్కర్ చౌరస్తా (ఉత్కూర్) కరీంనగర్ చౌరస్తా (ఎన్టీఆర్ చౌక్ )లను డెవలప్ చేయాలన్నారు. అక్రమణలకు గురవుతున్న ప్రభుత్వ భూములను భవిష్యత్తు అవసరాల దృష్ట్యా కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఉపాధ్యక్షులు కళ్లేపల్లి విక్రమ్, ప్రధాన కార్యదర్శి అల్లంపల్లి రమేష్, జక్కుల రాయాలింగు, పెండెం సత్తన్న, వేల్పుల ప్రేమ్ సాగర్, మినుముల శాంతికుమార్, కళ్యాణం రవి, బన్న శ్రీనివాస్, అడ్లూరి శివకుమార్, పెండెం రాజశేఖర్, క్రాంతికుమార్, న్యాతరీ చిన్నయ్య పాల్గొన్నారు.

## విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీయాలి




నవతెలంగాణ-తాండూర్

ఉపాధ్యాయులు విద్యార్థులకు నైపుణ్యత గల విద్యనందిస్తూ వారిలోని సృజనాత్మకతను వెలికి తీయాలని తాండూర్ మండల విద్యాధికారి మల్లేశం అన్నారు. సోమవారం విద్యా భారతి విద్యా సంస్థలకు జాతీయ అవార్డు వచ్చిన సందర్భంగా ఏర్పాటుచేసిన ఫెస్టివల్ కార్యక్రమంలో వారు ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. విద్యార్థికి చదువుతోపాటు సగటు మనిషి జీవన విధానంలో అవసరం అయ్యే నైపుణ్యత విద్యా ప్రమాణాలను బోధించాలని తెలిపారు. ఆటపాటలతో విద్యాబోధన చేయాలని సూచించారు. క్రమశిక్షణతో పాటు కళారంగాలపై ఆసక్తిని పెంపొందించాలన్నారు. విద్యార్థి మేధో శక్తికి అవసరమయ్యే క్విజ్ వ్యస రచన, చిత్ర లేఖనం క్రీడా పోటీలను నిర్వహించాలని తెలిపారు. ప్రతి విద్యార్థికి చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించే విధంగా ఉపాధ్యాయులు పాఠ్యాంశాలను బోధించాలన్నారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ సురభి శరత్ కుమార్, ఎస్ఐ కిరణ్ కుమార్, ప్రిన్సిపాల్ సరోజినీ దేవి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## గడువులోగా నిర్మాణ పనులు పూర్తి చేయాలి

- జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి హరీశ్‌రాజ్



నవతెలంగాణ-జైపూర్

భీమారం మండల ప్రజల సౌకర్యార్థం నిర్మించి తలపెట్టిన ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనం నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ హరీష్‌రాజ్ సూచించారు. 15 ఆర్థిక సంఘం నిధులు రూ.కోటి 43 లక్షలతో ఆరోగ్య కేంద్ర భవనం నిర్మిస్తుండగా సోమవారం ఆయన నిర్మాణ పనులు పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలతో నిర్మాణ పనులు పూర్తి చేయాలని కోరిన ఆయన త్వరితగతిన భవన నిర్మాణం పూర్తి చేసి మండల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలని అన్నారు. పనుల నిర్వాహణ తీరును పరిశీలించిన నిర్మాణపు పనుల విషయంలో పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ప్రసాద్, డాక్టర్ అనిల్ కుమార్, బుక్క వెంకటేశ్వర్ పాల్గొన్నారు.

**108 అంబులెన్స్ ప్రారంభించిన ఎమ్మెల్యే**

భీమారం మండల ప్రజల సౌకర్యార్థం మంజూరైన 108 అంబులెన్స్‌ను స్థానిక ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి ప్రారంభించారు. అత్యవసర సమయంలో మండల ప్రజలకు అందుబాటులో అంబులెన్స్ ఉండాలన్న స్థానికుల అభ్యర్థన మేరకు మంజూరు చేసిన అంబులెన్స్‌ను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, మండల కాంగ్రెస్ నాయకులతో కలిసి ప్రారంభించారు.

## సింగరేణి ఆవిర్భావ దినోత్సవాన కాంట్రాక్ట్ కార్మికుల నిరసన



నవతెలంగాణ-నస్పూర్

సింగరేణి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోమవారం అన్ని విభాగాలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎస్సీ కేఎస్ డివిజన్ కార్యదర్శి గట్టు మహేందర్, సహాయ కార్యదర్శి కాసీపేట రాజేశం మాట్లాడుతూ సింగరేణి వ్యాప్తంగా అన్ని విభాగాలలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల పట్ల సింగరేణి యాజమాన్యం వివక్షను వీడానాడాలన్నారు. చేసిన అగ్రిమెంట్ అంశాలను అమలు చేసి, కాంట్రాక్టు కార్మికుల వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఒకే కుటుంబం, ఒకే గమ్యం, ఒకే లక్ష్యం అనే నిదానదంతో సింగరేణి యాజమాన్యం సంస్థను ముందుకు నడుపుతుందని, కానీ వాస్తవంగా సింగరేణిలో అధికారుల కుటుంబం, పర్మినెంట్ కార్మికుల కుటుంబం, కాంట్రాక్టు కార్మికుల కుటుంబం వేరు లాగా యాజమాన్యం వ్యవహరిస్తుందన్నారు.

## 'ప్రజావాణికి అధికారుల గైర్హాజరు సరికాదు'

నవతెలంగాణ-జైపూర్

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజావాణి కార్యక్రమానికి వివిధ శాఖల అధికారులు గైర్హాజరు కావడం సరికాదని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కలెగూర రాజకుమార్ అన్నారు. భీమారం మండల కేంద్రానికి చెందిన యువకులతో కలిసి సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ప్రజావాణి ద్వార గ్రామానికి సంబంధించిన సమస్యకు పరిష్కారం చూపాలని కోరుతూ వినతీ పత్రం అందజేశారు. మండల పంచాయతీ అధికారి మినహా ఇతర ప్రభుత్వ అధికారులు ఎవ్వరు అందుబాటులో లేకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రభుత్వ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండకుండా ప్రజల సమస్యల పట్ల నిర్లక్ష్యం చేస్తున్నారని అన్నారు. చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి నియోజకవర్గానికి టూరిస్టుగా వచ్చిపోవడం తప్పా ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్షం చేస్తున్నారని అన్నారు.

## రాష్ట్ర స్థాయి సీఎం కప్ పోటీలకు ఆశ్రమ విద్యార్థులు



నవతెలంగాణ-లక్షెట్టిపేట

పట్టణంలోని ఆశ్రమ పాఠశాల విద్యార్థినులు సీఎం కప్ రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రంగు సత్యనారాయణ తెలిపారు. ఈ నెల 21న మంచిర్యాల జిల్లా పరిషత్ బాలుర పాఠశాల మైదానంలో కలెక్టర్ కుమార్ దీపక్ ఏర్పాటు చేసిన మోడల్ సెర్మనిలో గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థినులు ప్రతిభ కనబరిచి వరంగల్‌లో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని పేర్కొన్నారు. ఈ నెల 31 నుంచి రెండు జనవరి వరకు పోటీలు నిర్వహిస్తారు. ఈ పోటీలలో మద్దికుంట ఎల్లవ్వ అనే ఏడో తరగతి విద్యార్థిని కిడ్స్ జావిలియన్ త్రోలో జిల్లా స్థాయి ప్రథమ స్థానం, కొమురం మేఘమాల ఆరో తరగతి విద్యార్థిని 1500 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ స్థానం సాధించారు. ఈ సందర్భంగా పాఠశాల వార్డెన్ పి మల్లారెడ్డి, పాఠశాల పీడీ బండ జీవరత్నం, పాఠశాల ఉపాధ్యాయ బృందం అందరూ గెలుపొందిన విద్యార్థులను అభినందించారు.

**జాతీయ స్థాయి సైకిల్ పోలో పోటీలకు ఎంపిక**

జాతీయ స్థాయి సైకిల్ పోలో పోటీలకు ఎంపికైనట్టు విద్యార్థులు వెళ్తున్నారని తెలిపారు. ఈ నెల 23 నుంచి జనవరి ఒకటి వరకు తమిళనాడులోని కోయంబత్తూర్ లో నిర్వహించే జాతీయస్థాయి పోటీలకు బతుకమ్మ పాఠశాల విద్యార్థులు బయలుదేరారు. నవంబర్ 28 29 తేదీలలో కరీంనగర్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి సైకిల్ పోలో పోటీలలో సబ్ జూనియర్ విద్యార్థినిలు ప్రథమ స్థానం సాధించారు. జూనియర్ విద్యార్థులు ప్రథమ స్థానం సాధించారు. సీనియర్ విభాగంలో ద్వితీయ స్థానం సాధించారు.



## కాసిపేట పాఠశాలలో గణిత మేళా



నవతెలంగాణ-కాసిపేట

కాసిపేట మండల కేంద్రంలోని కాసిపేట పరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత మేళా నిర్వహించి గణిత నమూనాలను ప్రదర్శించారు. గణిత శాస్త్రవేత్త రామానుజన్ జన్మదినాన్ని పురస్కరించుకొని జాతీయ గణిత దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులు దాదాపుగా 50 వరకు గణిత నమూనాలను ప్రదర్శించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల విద్యాధికారి ముక్తవరపు వెంకటేశ్వర స్వామి హాజరయ్యారు. గణిత నమూనాల కోసం విద్యార్థులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంఈవో వెంకటేశ్వర స్వామి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టమైన విషయాన్ని ఎంపిక చేసుకుని, ఆ విషయంలో నిష్ణాతులు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మామిడిపల్లి సాంబమూర్తి గణిత ఉపాధ్యాయులు తెలంగాణ రాష్ట్ర రిసోర్స్ పర్సన్ సంతోష్‌ను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమణారెడ్డి, సుధారాణి, వేణు పాల్గొన్నారు.

## బీసీ హాస్టల్ దారి చదును



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని పొన్కల్ మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని పోలీస్‌స్టేషన్ సమీపంలో ఉన్న బీసీ హాస్టల్‌కు వెళ్లే దారిని పంచాయతీ ఈఓ రాహుల్ శుభ్రం చేయించారు. ఆ హాస్టల్‌కు వెళ్లే దారి పూర్తిగా ముళ్ల చెట్లతో నిండిపోవడంతో ఆ మార్గంలో నడిచేందుకు హాస్టల్ నిర్వాహకులు, విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. దీంతో పలు సంఘాల నాయకుల విజ్ఞప్తి మేరకు ఈఓ రాహుల్ సోమవారం ట్రాక్టర్ బ్లేడ్ సహాయంతో బీసీ హాస్టల్ రహదారి మార్గాన్ని శుభ్రం చేయించారు. సందర్భంగా ఈఓ రాహుల్ హాస్టల్ వాడెన్ రమేష్ ఇతర ఉపాధ్యాయులు అభినందించారు.

## డ్రైనేజీ సమస్యకు పరిష్కారం

నవతెలంగాణ-జైపూర్

మండల కేంద్రంలో గల సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాల డ్రైనేజీ సమస్యకు పరిష్కారం లభించింది. పాఠశాల డ్రైనేజీ బ్లాక్ కావడంతో విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను స్థానిక కలెక్టర్ దృషికి తీసుకుపోయినట్లు స్థానిక ఎంపీఓ శ్రీపతి బాపు రావు తెలిపారు. స్పందించిన కలెక్టర్ కుమార్ దీపక్ సోమవారం హైడ్రా లీక్ జెట్ మెషన్‌తో బ్లాకైన డ్రైనేజీని పునరుద్ధరించారు. కలెక్టర్ ఆదేశాలతో రామగుండం మున్సిపల్ కమీషనర్ స్పందించి హైడ్రా లీక్ జెట్ మెషన్ పంపించడంతో డ్రైనేజీ సమస్యకు పరిష్కారం లభించిందని తెలిపారు. డ్రైనేజీ బ్లాక్ తొలగించి శుభ్రం చేయడంలో జిల్లా కలెక్టర్ చూపించిన చొరవ పట్ల పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ నాగేశ్వర్ రావు, గ్రామ పంచాయతీ కార్యదర్శి ఉదయ్ కుమార్ పాల్గొన్నారు.



నవతెలంగాణ
ఆదిలాబాద్
మంగళవారం | డిసెంబర్ 24, 2024 | www.navatelangana.com

## అటవీని సందర్శించిన శిక్షణాధికారులు

నవతెలంగాణ-సిర్పూర్(టి)



హైదరాబాద్‌లోని దూలపల్లి ఫారెస్ట్ అకాడమీలో శిక్షణ పొందుతున్న బీట్ అధికారులు క్షేత్ర పర్యటనలో భాగంగా కోర్స్ డైరెక్టర్ రామ్మోహన్ ఆధ్వర్యంలో అటవీని సందర్శించారు. సోమవారం మండలంలోని ఇటిక్యాలపహాడ్‌లో జరిగిన ప్లాంటేషన్ పనులను పరిశీలించి అటవీ ప్రాంతంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులు, సంరక్షణ చర్యలు, టైగర్ ట్రాకింగ్ చేస్తున్న విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. వన్య జీవుల సంరక్షణలో ఎదురయ్యే సవాళ్లను, వాటిని పరిరక్షిస్తున్న తీరును ఎఫ్ఆర్ఓ ఇక్బాల్ హుస్సేన్ ట్రైనీ బీట్ ఆఫీసర్లకు తెలియజేశారు. కార్యక్రమంలో సెక్షన్ ఆఫీసర్లు వందన, మోహన్ రావు, బీట్ ఆఫీసర్లు లక్ష్మీ, నరేష్, వాచర్లు పాల్గొన్నారు.

## కేంద్ర మంత్రి అమిత్‌షా క్షమాపణ చెప్పాలి

నవతెలంగాణ-బోథ్



రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేద్కర్‌ను అవమానించిన కేంద్ర మంత్రి అమిత్ షా వెంటనే రాజీనామా చేయాలనీ డీఎస్పీ మండల అధ్యక్షుడు కొండమడుగు గణేష్ అన్నారు. సోమవారం మనదలులోని సాకేర గ్రామంలోని ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్‌పై చేసిన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని లేనిపక్షంలో ఉద్యమిస్తామని హెచ్చరించారు. అంబేద్కర్ భారత రాజ్యాంగాన్ని రాయడం వల్లే ఈ దేశంలో ఉన్న కోట్లాదిమంది బీసీ ఎస్సీ ఎస్టీలు అణగారిన కులాలకు మనుషులుగా గుర్తించ బడుతున్నారని తెలిపారు. వెంటనే అమిత్ షా క్షమాపణ చెప్పి తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో డీఎస్పీ నాయకులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న ఎస్ఎస్ఏ ఉద్యోగుల నిరసన



నవతెలంగాణ-ఆసిఫాబాద్

తమ సర్వీస్ రెగ్యులర్ చేయాలని అప్పటి వరకు పే స్కేల్ వర్తింపచేయాలని డిమాండ్ చేస్తూ సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు చేస్తున్న సమ్మెలో భాగంగా కలెక్టరేట్ ఎదుట 14వ రోజు నిరసన దీక్ష కొనసాగింది. నిరసన దీక్షకు కెరమెరి, సిర్పూర్-యు మండల విద్యాధికారులు ఆడే ప్రకాష్, సుధాకర్, సీపీఎస్ సంఘం అధ్యక్షుడు అజయ్ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమగ్ర శిక్షలో ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం అమలు కావడం లేదని, వెట్టి చాకిరి విధానం అమలవుతుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ విభాగంలో సుమారుగా 19,325 మంది ఉద్యోగులు 15 నుంచి 20 సంవత్సరాలుగా పనిచేస్తున్న పనికి తగిన వేతనం లభించడం లేదన్నారు. ఉద్యోగ భద్రత, ఆరోగ్య భద్రత లేకపోవడంతో ఉద్యోగుల్లో ఆందోళన నెలకొందన్నారు. సంఘం జిల్లా అధ్యక్షురాలు శృతిక, ప్రధాన కార్యదర్శి తుకారం మాట్లాడుతూ ఉద్యోగుల సంక్షేమం దృష్ట్యా సమ్మెను నివారించడానికి ముఖ్యమంత్రి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు సమగ్ర శిక్షా ఉద్యోగుల సర్వీసును వెంటనే రెగ్యులరైజ్ చేయాలని, పే స్కేలు వర్తింపజేస్తూ ఉత్తర్వులు ఇవ్వాలన్నారు. అప్పటివరకు సమ్మె కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల జిల్లా గౌరవ అధ్యక్షుడు మోహన్, ఉపాధ్యక్షురాలు నాగసుధ, జిల్లా కోశాధికారి నగేష్, మీడియా ప్రతినిధి గేడేకార్ సంతోష్, దుర్గం సందీప్, సీఆర్పీ అధ్యక్షుడు పవన్, ప్రధాన కార్యదర్శి రాజేష్, ఎంఐఎస్ ప్రధాన కార్యదర్శి ప్రశాంత్, రాజ్ కుమార్, సీసీఓ ఉపాధ్యక్షుడు మహేష్, ప్రకాష్, కేజీబీవీ ఎస్ఓలు నలంద, మీనా, రమాదేవి, సీఆర్టీలు అన్నపూర్ణ, చైతన్య అన్నపూర్ణ, స్వప్న, పీటీఐ అధ్యక్షుడు సత్యనారాయణ, రమేష్, ప్రకాష్, ప్రసన్న, స్వప్న, విజయ బాబు, తిరుపతి, సుభాష్, సతీష్, తిరుపతి, శివరాం, మెస్సెంజర్ అధ్యక్షుడు సంతోష్, బోజన్న పాల్గొన్నారు.

## టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర మహా సభను విజయవంతం చేయండి



నవతెలంగాణ-కౌటాల

తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) రాష్ట్ర ఆరవ విద్యా, వైజ్ఞానిక మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా ఉపాధ్యక్షుడు సోయం ఇందురావ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణంలో మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి రాష్ట్ర మహాసభలను రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో నిర్వహించడం జరుగుతుందని, ఈ సంవత్సరం రాష్ట్ర ఆరవ విద్య, వైజ్ఞానిక మహాసభలు నల్లగొండ జిల్లా కేంద్రంలో ఈనెల 28 నుండి మూడు రోజుల పాటు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ మహాసభల్లో ప్రభుత్వ విద్యారంగంపై మేధావుల ఆధ్వర్యంలో లోతైన చర్చ జరుగుతుందన్నారు. రాబోయే కాలానికి ప్రభుత్వ విద్యా రంగం ఉపాధ్యాయుల అభ్యున్నతికి సూచనలు సలహాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నారాయణ సింగ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఆదర్శ హాస్టల్ వర్కర్ల పెండింగ్ వేతనాలు చెల్లించాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆదర్శ పాఠశాలలో పనిచేస్తున్న వసతి గృహ కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టర్ వెంకటేష్ ధోత్రే, ఇన్‌చార్జి డీఈఓ ఉదయభాబును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు నెలల నుండి కార్మికుల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని, దీనితో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎలాంటి ఉద్యోగ భద్రత లేదని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కూడా లేనటువంటి పరిస్థితిలో పనిచేస్తున్నారన్నారు. తక్షణమే స్పందించి పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించేలా, పెరుగుతున్న ధరలు అనుగుణంగా వేతనాలు పెంచాలని, ప్రతి నెల ఐదవ తేదీ లోపు వేతనాలు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ప్రతి కార్మికునికి రూ.10 లక్షల ఆరోగ్య భీమా సౌకర్యం కల్పించాలని విన్నవించారు. కార్యక్రమంలో మోడల్ హాస్టల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు పార్వతి, రేఖ, కవిత, మంజుల, సుమలత పాల్గొన్నారు.

## ఉచిత కుట్టు మిషన్లకు దరఖాస్తులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

తెలంగాణ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా మైనారిటీ మహిళలకు ఉచిత కుట్టు మిషన్ అందించేందుకు అర్హులైన వారి నుండి దరఖాస్తులను స్వీకరించడం జరుగుతుందని జిల్లా అల్ప సంఖ్యాక వర్గాల సంక్షేమ శాఖ అధికారి రమాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి, అర్హత గల మైనారిటీ మహిళలు జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ కార్యాలయంలో పనివేళలో అందజేయాలని తెలిపారు.

## అంగన్‌వాడీ టీచర్ల పెండింగ్ వేతనాలు చెల్లించాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



మినీ అంగన్‌వాడీడీ నుండి ప్రధాన అంగన్‌వాడీలుగా మారిన టీచర్లకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ త్రివేణి అన్నారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌తో కలిసి కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మినీ అంగన్‌వాడీ టీచర్లను ప్రధాన అంగన్‌వాడీ టీచర్లుగా మార్చిన సమయంలో ట్రెజరీలో వివరాలు మార్పు చేయలేదని దీంతో వారి వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. అతి తక్కువ వేతనాలతో ఇబ్బందులు పడుతున్న వారికి దీనితో మరింత ఆర్థిక ఇబ్బందులు పడాల్సివస్తుందన్నారు. ఇప్పటికైనా పెండింగ్ వేతనాలు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు రాజేందర్, యూనియన్ కోశాధికారి అరుణ, రాజేశ్వరి, ఉమాదేవి, షీలా, సంగీత, మీరాబాయి, జ్యోతి, సింధు, సోంబాయి పాల్గొన్నారు.

**ఆర్పీలకు జీఓ 60 వేతనాలు ఇవ్వాలి**

పట్టణ ఆర్పీలకు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని ఇతర సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థలో సుమారు 6,000 మంది ఆర్పీలుగా కొనసాగుతున్నారన్నారు. మున్సిపాలిటీలో రుణాల మంజూరులో వీరి పాత్ర ఎంతో ఉందని తెలిపారు. ఆర్పీల సమస్యలు ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షురాలు సునీత, కోశాధికారి స్వర్ణలత, నాయకులు మాధురి, రమ్యశ్రీ, శైలజ, రమ, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు రాజేందర్ పాల్గొన్నారు.

## ఘనంగా సింగరేణి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



నవతెలంగాణ-జైపూర్

జైపూర్ సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రంలో సోమవారం సింగరేణి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ప్లాంట్ ఈడి (హెడ్ అఫ్ ద ప్లాంట్) ఎస్వీ రాజశేఖర్ రావు ముఖ్యఅతిథిగా హాజరై జాతీయ పతాక ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ సింగరేణి ఆవిర్భవించి 136 సంవత్సరాలు అవుతుందన్నారు. మొదట్లో దక్కన్ కంపెనీగా ఉండి ఆ తర్వాత కాలక్రమేన సింగరేణి కాలరీస్ కంపెనీగా ఉద్భవించిందన్నారు. అదేవిధంగా సోమవారం రాత్రి ప్లాంట్ ఆవరణలో సింగరేణి దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన స్టాల్స్‌ని ఈడీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉత్తమ ఉద్యోగులుగా ఎంపికైన మల్లెల సత్యనారాయణరెడ్డి, సీనియర్ ఇన్స్‌పెక్టర్ (ఎస్ అండ్ పీసీ), వైష్ణవి, సీనియర్ అసిస్టెంట్‌లను, అలాగే ఉత్తమ అధికారులు కొండ వెంకటయ్య, డి నవీన్ కుమార్, డిఎక్యు ఎస్ఈ(ఈ అండ్ ఎం)లను శాలువాతో సన్మానించి, సర్టిఫికెట్లు, బహుమతులను ప్రధానం చేశారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు వీక్షకులను ఆకర్షించాయి. కార్యక్రమంలో జీఎం (పీసీఎస్) శ్రీనివాసులు, చీఫ్ ఆఫ్ ఓఅండ్ జేఎస్ సింగ్, ఏఐటీయూసీ పిట్ సెక్రటరీ సత్యనారాయణ, సీఎంఓఏఐ బ్రాంచ్ ప్రెసిడెంట్ సముద్రాల శ్రీనివాస్, అధికారులు ఉద్యోగులు, మహిళలు పాల్గొన్నారు.

## ఉత్పత్తుల ఎగుమతి సామర్థ్యాన్ని పెంచాలి

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జిల్లాలో వ్యవసాయ, పారిశ్రామిక ఉత్పత్తుల ఎగుమతి సామర్థ్యాన్ని పెంపొందించే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. అధికారులు, పారిశ్రామికవేత్తలు, రైస్ మిల్లుల యజమానులు, జిన్నింగ్ మిల్లుల యజమానులు, ఎస్పీఎం ప్రతినిధులతో జిల్లా స్థాయి ఎగుమతుల సామర్థ్యం పెంపుదల అంశంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిర్పూర్ కాగితపు మిల్లు నుండి కాగితం ఉత్పత్తులు సుమారు 1200 టన్నుల ఉత్పత్తి చేసి దుబాయ్, ఒమన్ లాంటి దేశాలకు సుమారు రూ. 7 కోట్ల విలువైన ఉత్పత్తులను ఎగుమతి చేయడం జరిగిందని తెలిపారు. ఈ ప్రాంతంలో లభించే నాణ్యమైన పత్తిని అధికంగా బంగ్లాదేశ్ దేశానికి ఎగమతి చేయడం జరుగుతుందని తెలిపారు. నాణ్యమైన బియ్యాన్ని పండించడం ద్వారా బంగ్లాదేశ్, ఉగాండా, మలేషియా, సింగపూర్ లాంటి దేశాలలో మన దేశం ధాన్యానికి మంచి డిమాండ్ ఉందని, తద్వారా రైతులకు ఎంతో లబ్ధి చేకూరుతుందని, ఈ క్రమంలో పంట సాగుకు రైతులను ప్రోత్సహిస్తూ అధిక దిగుబడి సాధించే విధంగా సన్నద్ధం చేయాలని సూచించారు. వెదురుతో తయారుచేసిన అలంకరణ వస్తువులు, చిరుధాన్యాలు, తేనె లాంటి ఆరోగ్యకరమైన ఉత్పత్తులకు జిల్లాలో నెలకొన్న పరిస్థితులు పూర్తి అనుకూలంగా ఉంటాయని, ఈ నేపథ్యంలో నాణ్యమైన ఉత్పత్తుల ఉత్పాదకతను పెంచి ఎగుమతి సామర్థ్యాన్ని పెంపొందించవచ్చని తెలిపారు. ఆ దిశగా అధికారులు దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ ఎం.అశోక్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారాం, అదనపు గ్రామీణ అభివృద్ధి అధికారి రామకృష్ణ, జిల్లా మత్స్యశాఖ ఏడీ సాంబశివరావు, ఉద్యానవన శాఖ అధికారి నదీమ్, సిర్పూర్ కాగితపు మిల్లు ప్రతినిధులు, రైస్ మిల్లర్లు, జిన్నింగ్ మిల్లుల యజమానులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రీ క్రిస్మస్ వేడుకలు

- చిన్నారులతో కలిసి కేక్ కట్ చేసిన ఎమ్మెల్యే హరీష్‌బాబు




కాగజ్‌నగర్ : విద్యార్థులో కలిసి కేక్‌కట్ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ పట్టణంలో సోమవారం ప్రీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో స్థానిక ఫాతిమా కాన్వెంట్‌లో నిర్వహించిన ఈ వేడుకలకు సిర్పూరు ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు ముఖ్య అతిథిగా హాజరై చిన్నారులతో కలిసి క్రిస్మస్ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రపంచంలో యేసు క్రీస్తు చరిత్ర లిఖింపబడిందన్నారు. క్రైస్తవులు యేసును నమ్ముకుంటూ వ్యసనాలకు దూరంగా, పిల్లలను ఉన్నతులుగా తీర్చిదిద్దుతూ కుటుంబ పోషణను సమర్థవంతంగా చేపడుతున్నారని అన్నారు. వారికి ఏ సమస్య వచ్చినా తమ దృష్టికి తీసుకువస్తే ప్రభుత్వ సహకారంతో పరిష్కరించడానికి సిద్ధంగా ఉన్నానని అన్నారు. అనంతరం విందు కార్యక్రమం నిర్వహించారు. ఇందులో నియోజకవర్గ పాస్టర్స్ వెల్ఫేర్ అసోషియేషన్ అధ్యక్షులు కూచిపూడి ఏసుకుమార్, కార్యదర్శి జెజెఎల్ మూర్తి, కోశధికారి జాకబ్, తిమోతి జయరాజ్, వినోద్ మాథ్యూ, రాజశేఖర్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

**రెబ్బెన** : మండలంలోని ఆగే పెసలం చర్చిలో కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో ప్రీ క్రిస్టమస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా జిల్లా నాయకులు అనిల్ గౌడ్ పాల్గొని కేక్‌కట్‌చేసి క్రిస్టమస్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పాస్టర్ జెరామయ్య, మండల అధ్యక్షుడు లావుడ్య రమేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దేవజి, మాజీ సర్పంచ్ సోమశేఖర్, జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి ఎర్రం తిరుపతి, మాజీ జడ్పీటీసీ సంతోష్, నాయకులు చిరంజీవి పాల్గొన్నారు.

**ఆసిఫాబాద్** : పట్టణంలోని సెయింట్ మేరీస్ ఉన్నత పాఠశాలలో సెమీ క్రిస్టమస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరైన మండల విద్యాధికారి రాథోడ్ సుభాష్ మాట్లాడుతూ క్రిస్టమస్ గొప్పతనాన్ని వివరిస్తూ క్రీస్తు జీవితం ఆదర్శనీయమనీ, పిల్లలు ఎప్పుడు కూడా ప్రశాంతంగా ఉంటూ వారి జీవిత లక్ష్యాలను నిర్ణయించుకుని వాటికోసం కృషి చేయాలన్నారు. ఈ సంద్భంగా యేసు క్రీస్తు జన్మ ఇతివృత్తాన్ని వివరిస్తూ నాటిక ప్రదర్శనలు, నృత్యాలు ఆటపాటలతో విద్యార్థులు ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సిస్టర్ లిబిన్, కరస్పాండెంట్ అనిమాథ్యూ, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.



రెబ్బెన



ఆసిఫాబాద్

## గ్రంథాలయ ఆధునీకరణకు ప్రత్యేక చర్యలు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని జైనూర్ మండలం మార్లవాయి గ్రామంలో గల గ్రంథాలలయ ఆధునీకరణకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి తెలిపారు. సోమవారం జిల్లాలోని జైనూర్ మండలం మార్లవాయి గ్రామంలో గ్రంథాలయ నవీకరణకు చేపట్టాల్సిన పనులను పరిశీలించారు. గ్రంథాలయంలో పాఠకులు, పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులకు అవసరమైన అన్ని పుస్తకాలు, పత్రికలు, మెటీరియల్‌ను అందుబాటులో ఉంచి అన్ని సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఆసిఫాబాద్ డివిజనల్ పంచాయతీ అధికారి, మండల పరిషత్ అభివృద్ధి అధికారి, మండల పంచాయతీ అధికారి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ఉద్యోగస్తుల సమస్యలను పరిష్కరించాలి



నవతెలంగాణ-నస్పూర్

జిల్లాలోని మోడల్ స్కూల్‌లో పనిచేసే ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య(ఐఎఫ్‌టీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి బ్రహ్మానందం డిమాండ్ చేశారు. సోమవారం డీఈఓ యాదయ్యను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాశాఖ సమగ్ర శిక్షలో టైప్-4 కేజీబీవీ మోడల్ స్కూల్ అటాచ్డ్ గర్ల్స్ హాస్టల్‌కు సంబంధించిన ఉద్యోగులు పది సంవత్సరాలుగా తక్కువ వేతనాలతో పనిచేస్తున్నారన్నారు. మోడల్ స్కూల్స్ ప్రిన్సిపాల్, ఎస్ఎండీసీ ద్వారా అవుట్ సోర్సింగ్ బేసిక్‌పైన రిక్రూట్మెంట్ చేయడం జరిగిందన్నారు. 2018 సంవత్సరం నుండి టైప్-4 కేజీబీవీ అని ఎస్ఎస్‌లో అంతర్భాగం చేశారని, కానీ ఈ ఉద్యోగస్తులకు జీతాలలో కానీ డ్యూటీ చాట్‌లో కానీలో ఎలాంటి మార్పు జరగలేదన్నారు. 24 గంటలు అతి తక్కువ వేతనాలతో డ్యూటీ చేస్తూ కుటుంబాలకు దూరంగా ఉంటూ నరకయాతన అనుభవిస్తున్నారని తెలిపారు. కనీసం ఈ ఉద్యోగస్తులకు 'పే రోల్ ఐడీ లేదని, జీతాలు కూడా ఆరు నెలలు ఆలస్యం అవుతున్నాయన్నారు. మోడల్ స్కూల్స్ గర్ల్స్ హాస్టల్లో పనిచేసే సిబ్బందికి పే రోల్ ఐడీ తక్షణమే కేటాయించాలన్నారు. ప్రతినెల జీతాలు మొదటి వారంలో చెల్లించాలని, కనీస వేతన స్కేలును తక్షణమే అమలు చేయాలని, ప్రతి ఉద్యోగికి జీవిత బీమా రూ.10 లక్షలు, ఆరోగ్య భీమా రూ.5 లక్షల సౌకర్యం కల్పించాలన్నారు. అలాగే విద్య శాఖలో విలీనం చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని, స్వీపర్, స్కాంవెంజర్ పోస్టులను కేటాయించాలన్నారు. కార్యక్రమంలో దివ్య, శారద, స్వరూప రాణి, సంధ్య, రాజేశ్వరి, దివ్యభారతి, సుజాత, హరిత, భారతి, స్వప్న, సునీత, భారతి, అరుణ పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులు సమయ పాలన పాటించాలి



నవతెలంగాణ-కౌటాల

ఉపాధ్యాయులు సమయ పాలన పాటించాలని మండల విద్యాశాఖ అధికారి గావుడె హనుమంతు అన్నారు. సోమవారం మండలంలోని బోదంపల్లి ప్రాథమిక పాఠశాలను ఉదయం ప్రార్థన సమయానికి ముందే వెళ్లి పరిశీలించారు. అనంతరం విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి జవాబులు రాబట్టారు. ఆపార్ ఐడీపై ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. మధ్యాహ్న భోజనం నాణ్యత లోపం లేకుండా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం మండల కేంద్రంలోని కేజీబీవీను తనిఖీ చేసి ఆహార పదార్థాలను పరిశీలించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తిన తమ దృష్టికి తీసుకురావాలన్నారు. పదవ తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలని ఆదేశించారు. అదే విధంగా ఎంపీడీఓ కోట ప్రసాద్ శీర్షా ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేసి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.

## రెబ్బెన ప్రెస్ క్లబ్ కార్యవర్గం ఎన్నిక



నవతెలంగాణ-రెబ్బెన

మండల ప్రెస్ క్లబ్ కార్యవర్గాన్ని సోమవారం గోలేటి భీమన్న స్టేడియంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా ఎస్.సంపత్ కుమార్, అధ్యక్షుడిగా జె.సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా వి.వినయ్ కుమార్, ట్రెజరర్‌గా కే.రమేష్, ఉపాధ్యక్షులుగా జె.ప్రకాష్, సంయుక్త కార్యదర్శిగా ఎం.విజయలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షులు సత్యనారాయణ మాట్లాడుతూ మండలంలో జర్నలిస్టుల హక్కుల సాధన, సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. అనంతరం కార్యవర్గ సభ్యులను శాలువాలతో సన్మానించి అభినందనలు తెలిపారు.